



# విజయభాను






విశాఖపట్నం, ఆదివారం 24-02-2019 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 142 పేజీలు : 8 వెల : 1 రూపాయి

# ఉగ్రదాడిని తుదముట్టిస్తా



- పాకిస్తానీయులు మరి మారరు
- కశ్మీరీబిడ్డలకు అండగా ఉంటా
- ఉగ్రవాదంపై పోరాటం అందరిదీ
- ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ : పుల్వామా ఉగ్రవాద దాడి నేపథ్యంలో కశ్మీరీలపై దాడులను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. వారిని కాపాడవలసిన బాధ్యత, కర్తవ్యం తనకు ఉన్నట్లు తెలిపారు. భారత దేశం చేస్తున్న పోరాటం కశ్మీర్ కోసమేనని, కశ్మీర్‌కు వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. రాజస్థాన్‌లోని టోంక్‌లో జరిగిన బహిరంగ సభలో శనివారం ఆయన మాట్లాడారు.

కశ్మీరీలు ఉగ్రవాదం వల్ల చాలా నష్టపోతున్నారని, బాధితులవుతున్నారని, అటువంటి బాధితులను తప్పనిసరిగా కాపాడాలని మోదీ అన్నారు. ఉగ్రవాదంపై పోరాటంలో కశ్మీరు యువతను కలుపుకుపోవడం చాలా ముఖ్యమని తెలిపారు. కొన్ని రోజుల నుంచి కశ్మీరీ యువతకు జరుగుతున్నది ఏమిటో పరిశీలించాలన్నారు. ఉగ్రవాదంపై భారత దేశం చేస్తున్న పోరాటంలో ప్రతి కశ్మీరు బిడ్డ అండగా ఉన్నట్లు తెలిపారు.

ప్రతి కశ్మీరు బిడ్డను కాపాడే బాధ్యత, కర్తవ్యం తనకు ఉన్నట్లు తెలిపారు. కశ్మీరీలపై దాడులు జరగకూడదని, అటువంటి సంఘటనలు దేశాన్ని ముక్కలు చేయాలనుకునే వారికి ఊతమిస్తాయని హెచ్చరించారు. కశ్మీరు బిడ్డలను రక్షించవలసిన బాధ్యత ప్రతి భారతీయునిపైనా ఉందని చెప్పారు. జవాన్లపై దాడికి ప్రతీకారం తీర్చుకుంటామన్నారు.

దేశం పోరాటం కశ్మీర్ పై కానీ కశ్మీరీలపై కాదన్నారు ప్రధాని నరేంద్రమోడీ. రాజస్థాన్‌లోని టోంక్‌లో ఓ భారీ బహిరంగ సభలో ఆయన తరువాయి 2లో..

# యుద్ధ విమానంలో కోపైలట్‌గా సింధు

- ఏరో ఇండియా విమెన్స్ డే వేడుకల్లో సింధు
- మహిళా పారాట్రూపర్ల ప్రదర్శన అత్యద్భుతం
- ఏవియేషన్ రంగంలో మహిళా సేవలు



బెంగళూరు: ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు శనివారం స్వదేశంలో తయారైన తేలికపాటి యుద్ధ విమానం తేజస్‌ను నడిపారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఏరో ఇండియా విమెన్స్ డే వేడుకలను నిర్వహించింది. ఇందులో భాగంగానే సింధు తరువాయి 2లో..

## కోడి రామకృష్ణకు మహాప్రస్థానంలో అంత్యక్రియలు

### తలకొరివి పెట్టిన పెద్ద కూతురు దివ్య దీప్తి



హైదరాబాద్: లెజెండరీ దర్శకుడు కోడి రామకృష్ణ భౌతికకాయానికి అంత్యక్రియలు ముగిశాయి. హైదరాబాద్ మహాప్రస్థానంలో ఆయన తరువాయి 2లో..

## వైకాపాకు ఓటేస్తే..

- పార్టీ నేతలకు వ్యూహ నిర్దేశం
- ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

అమరావతి: రాష్ట్ర హామీలు నెరవేర్చాకే ప్రధాని మోదీ ఇక్కడ కాలు మోపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో ఒక్క ఓటు వైకాపాకు పడినా అది కేసీఆర్‌కు, మోదీకి పడినట్లేనని, ఈ విషయం ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ వచ్చాకే తెలుగువాడి ఉనికి ప్రపంచానికి తెలిసిందన్నారు. ఆనాడు దిల్లీ కుట్రలను ఎన్టీఆర్ ఎలా తిప్పికొట్టారో అదే స్ఫూర్తితో ఇప్పుడూ తిప్పికొట్టాలని క్యాడర్‌కు పిలుపునిచ్చారు. ఈ మేరకు పార్టీ నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం తరువాయి 2లో..



## 'గోల్కొండ సింహం' బద్దం బాల్‌రెడ్డి కన్నుమూత

### కమలదళంలో విషాదఛాయలు

హైదరాబాద్: బీజేపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే బద్దం బాల్‌రెడ్డి కన్నుమూశారు. బంజరాహిల్స్ కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. 1985, 1989, 1994లలో కార్వాన్ నియోజకవర్గం నుంచి మూడుసార్లు బద్దం బాల్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇటీవల జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో రాజేంద్రనగర్ నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. పాతబస్తీ రాజకీయాల్లో తనదైన ముద్రవేసిన ఆయన.. అప్పటి ఎంఐఎం అధినేత సలావుద్దీన్ ఒవైసీతో ఢీ అంటే ఢీ అనేలా ఉండేవారు. గోల్కొండ సింహం అంటూ ఆయన అభిమానులు ప్రేమగా పిచుకుంటుంటారు. బాల్‌రెడ్డి మృతితో కమలదళంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.






## కాంగ్రెస్ నేతలతో కేటీఆర్ భేటీ..



వార్త 2వ పేజీలో..

## వేర్పాటువాదులపై ఉక్కుపాదం!



- శ్రీనగర్‌కు 100 కంపెనీల పారామిలటరీ దళాలు
- కశ్మీరీల హక్కులపై సోమవారం కీలక తీర్పు..

శ్రీనగర్: కశ్మీర్ లోయలోని వేర్పాటువాదులపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపేందుకు చకచక తరువాయి 2లో..

# విశాఖ రైల్వేజోన్‌పై త్వరలో ప్రకటన

- అధిష్ఠానంతో చర్చించాం..
- సానుకూలంగా స్పందించారు
- భాజపా అన్ని విధాలుగా ఏపీకి సహకరిస్తోంది
- 'ఉమ్మడి' ప్రకటించినా అమరావతిపై తొందరెందుకో!?
- ఏపీ భాజపా అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ



దిల్లీ : విశాఖ రైల్వేజోన్ అంశంపై ప్రధాని నరేంద్రమోదీ, రైల్వే మంత్రి పీయూష్ గోయల్‌ను కలిసి చర్చించామని, వారి నుంచి సానుకూల నిర్ణయం వచ్చిందని ఏపీ భాజపా అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. మార్చి 1న ప్రధాని మోదీ.. రాష్ట్రంలో పర్యటించనున్నందున భాజపా నేతలు దిల్లీలో ప్రధాన మంత్రి, పీయూష్ గోయల్‌ను కలిశారు. ఈసందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ మీడియాతో మాట్లాడుతూ.. రైల్వేజోన్ ఆవశ్యకతపై పీయూష్ గోయల్‌కు వివరించినట్లు చెప్పారు. విశాఖ ఎంపీ హరిబాబు నేతృత్వంలో రైల్వే జోన్ సాధిస్తామని గతంలోనే మీడియాకు చెప్పానని కన్నా గుర్తు చేశారు. రైల్వే జోన్‌పై త్వరలోనే ప్రకటన ఉంటుందని వెల్లడించారు. ఏపీకి భాజపా ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరించిందన్నారు. తెదేపా నాలుగేళ్లపాటు ఎన్డీఏలో భాగస్వామిగా ఉన్నందున ఏ రాష్ట్రానికి ఇవ్వని నిధులు ఇచ్చిందన్నారు. రాష్ట్రానికి ఎంతమేలు చేసినప్పటికీ చంద్రబాబు తెలివిగా భాజపా పేరు బయటికి రానివ్వలేదన్నారు. హైదరాబాద్ పదేళ్లపాటు ఉమ్మడి రాజధానిగా ఉన్నప్పటికీ చంద్రబాబు.. కేసీఆర్‌తో తగువు పెట్టుకుని ఏపీకి పారిపోయి వచ్చారని విమర్శించారు. దగ్గుబాటి పురంధేశ్వరి, కంభంపాటి హరిబాబు, గోకరాజు గంగరాజు, జీవీఎల్ నరసింహారావు, ఎమ్మెల్సీ మాధవ్, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు తదితరులు ప్రధాని, పీయూష్ గోయల్‌ను కలిసిన వారిలో ఉన్నారు.




# గోవిందనామప్రియుడు శ్రీవేంకటేశ్వరుడు



విశాఖపట్నం : అన్నమయ్య పదకోకిల పద్మశ్రీ డాక్టర్ శోభారాజ్ స్థాపించిన అన్నమా చార్య భావనా వాహిని విశాఖ నగర శాఖ ఆధ్వర్యంలో రామ్ నగర్ మెయిన్‌రోడ్డులో గల శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో నిర్వహించిన శ్రీ వేంకటేశ్వరుని వైభవంపై ప్రవచనం మరియు అన్నమా చార్య సంకీర్తన అందరినీ ఆకట్టుకుంది. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ శ్రీ వేంకటే శ్వరుని వైభవంపై ప్రవచనం చేస్తూ గోవిందనామ ప్రియునిగా శ్రీ వేంకటేశ్వరస్వామిని సేవించా లన్నారు.

శ్రీని వాసుని కటాక్షం అపారమైనదని శ్రీ వేంకటేశ్వర స్వామి వైభవాన్ని శ్లాఘించారు. ప్రముఖ సంగీత విద్వాంసులు పారుపల్లి సత్య నారాయణ శిష్యురాలు డి.సచ్చీ దేవి అన్నమా చార్య సంకీర్త నలు గానం చేసి సభికుల మన్ననలను పొందారు. పై సంకీర్తన కార్య క్రమానికి కీబోర్డుపై ఆర్.నాయుడు, తబలాపై రమేష్, తాళంపై ఎం. వెంకట రాజశేఖర్లు వాద్య సహకారం అందించారు. ఎ.అన్నపూర్ణ నేతృత్వంలో సామూహికంగా శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణ జరిగింది. ఈ కార్యక్రమంలో సంస్థ కో-ఆర్డినేటర్ ఎ.పి.ఎస్ .మూర్తి, ప్రోగ్రాం కన్వీనర్ ఎం.వి.రాజశేఖర్, కో-కన్వీనర్స్ ఆచార్య ఆర్.మురళీకృష్ణ, జి.ఉదయభాస్కరరావు, ఎ.అన్నపూర్ణ, శ్రీ రాఘవేంద్ర స్వామి వారి మఠం మేనేజర్ కె.పవన్ కుమార్ ఆచార్య, విశాఖ నగరానికి చెందిన ప్రముఖులు అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు. విచ్చేసిన వారందరికీ తీర్థ ప్రసాద వితరణ జరిగింది.

# ఆంధ్రాషెల్లీ...దేవులపల్లి



విజయనగరం: భావ కవిత్వానికి ఆద్యుడైన దేవేలపల్లి వేంకట కృష్ణ శాస్త్రి అద్భుత సాహితీవేత్తని, ఆంధ్రాషెల్లీగా పేరుపొందారని తెలుగు భాషా పరిరక్షకులు మక్కువ చంద్రకళాధర్ అన్నారు. భావ కవితా మహానుభావుడు కృష్ణ శాస్త్రి వర్థంతి సందర్భంగా శనివారం స్థానిక ఉడాకాలనీ నేషనల్ స్కూల్‌లో దేవులపల్లి వర్థంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణపక్షం, ఊర్వశి వంటి రచనలు అనేక వ్యాసాలు, పలు సినీ గేయాలు రచిచిన కృష్ణశాస్త్రి మన సాహితీ సంపద అన్నారు.

సహజంగా ఆయన ప్రకృతి ప్రేమికుండని అందుకే పామరులకు సైతం ఆయన రచనలు పరవ ంపజేశాయని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ కృష్ణవేణి మాట్లాడుతూ కృష్ణశాస్త్రి దేశభక్తి గీతాలు ఎందరికో స్ఫూర్తి నిచ్చా యని అన్నారు. కళా ప్రపూర్ణ, పద్యభూషన్ అవా ర్డులు తన రచనలకు దక్కాయని తెలిపారు. అతని రచనలు ఆనంద లోగిళ్ళని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో ముం దుగా దేవులపల్లి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

# ఓటు నమోదు (స్పెషల్ క్యాంపు) కార్యక్రమం



విశాఖపట్నం : 39వవార్డులో శనివారం సెక్టర్ ఆఫీసర్ యన్.కె.షా మరియు లీలా కుమారి (టి.సి) సమక్షంలో ఓటు నమోదు (స్పెషల్ క్యాంపు) కార్యక్రమం జరిగింది. ఆ వార్డులో వుడా కాలనీ కమ్యూనిటీ హాలు నందు గల 265, 266, 267, 268 పోలింగ్ స్టేషను నందు బిఎల్ఒల సమక్షంలో కొత్త ఓటు నమోదు మరియు పరిశీలన జరిగింది. వైయస్ఆర్ పార్టీ బూత్ కన్వీనర్‌లు బిఎల్ఒలకు సహకరించారు. ఈ కార్యక్రమంలో వైయస్ఆర్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సనపల చంద్రమౌళి స్వయంగా ఆయా బూత్‌ల ఓటరుల జాబితాను పరిశీలించి ఓటరు జాబితాలో తొలగిపోయిన ఓటరులను తిరిగి కొత్తగా ఓటు నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో 39వవార్డు ప్రెసిడెంట్ పప్పల సునీత తదితరులు పాల్గొన్నారు.

# గాజు గ్లాసు గుర్తును పరిచయం చేస్తున్న సీతారాం



అనకాపల్లి : అనకాపల్లి జనసేన ఎన్నికల గుర్తు గాజు గ్లాసును పరిచయం చేస్తూ నెహ్రూచౌక్ జంక్షన్ వద్ద శనివారం సాయంత్రం ప్రజలకు టీ అందిస్తూ వచ్చే ఎన్నికలలో జనసేన పార్టీకి అఖండ విజయాన్ని అందించాలని కోరారు. జనసేన నియోజకవర్గ నాయకులు కొణతాల సీతారాం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఆయన ప్రజలకు 25 ఎలా బంగారు భవిష్యత్తు కోసం, అవినీతి లేని పాలన కోసం వచ్చే ఎన్నికల్లో తమ నాయకుడు ముఖ్యమంత్రి చేయాలని జనసేన సిద్ధాంతాలను తెలియపరచారు. ఈ కార్యక్రమంలో దాడి బుజ్జి షేక్ ఉమార్, కాండ్రేగుల సునీల్, సురభి హరీష్, గల్లా వినోద్, పరదేశి నాయుడు, అయినాల నాయుడు, జ్యోతుల గణేష్, జనసేన కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబిత ప్రదర్శన

ఎస్.రాయవరం : మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో ఈనెల 23, 24 తేదీల్లో సిబ్బంది అందుబాటులో ఉండి ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తారని తహశీల్దార్ ఎం.రవిజోసెఫ్ పేర్కొన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాల యంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 23, 24 తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు అందు బాటులో ఉంటారన్నారు. నూతన ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తారని, ప్రజలు తమ ఓటు ఉన్నదీ లేనిదీ తనిఖీ చేసుకొని తప్పులుంటే సరి చేసుకో వాలన్నారు. మార్పులు, చేర్పులకు సంబంధించిన దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు. బిఎల్ఒ, విఆర్ఒ, తలయారీలు అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తారని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# అమర వీరులకు ఘన నివాళి

ఎస్.రాయవరం : జమ్ము కశ్మీర్‌లో ఉగ్రదాడిలో మృతి చెందిన అమర జవాన్లకు గురువారం ఘన నివాళులు అర్పించారు. విశ్వాస్ ఫర్ ది సొసైటీ నేతృత్వంలో అడ్డురోడ్డులోని విశ్వశాంతి, శ్రీవిద్య, వాసన్, సెయింట్ పీటర్స్ పాఠశాలల విద్యార్థులు ప్ల కార్డులు ప్రదర్శించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అడ్డురోడ్డు కూడలిలో ర్యాలీ నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో వంశీ, భాస్కర్, అశోక్, దుర్గాప్రసాద్, మణికంఠ, రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సేవ్ ఎన్విరాన్మెంట్ పై
## విజ్ఞాన ప్రదర్శన

భీమునిపట్నం : భీమిలి డివిజన్ పద్దెనిమిదవ వార్డు మున్సిపల్ హైస్కూల్ లో సేవ్ ఎన్విరాన్మెంట్ (పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం) అనే అంశంపై విజ్ఞాన ప్రదర్శన జరిగింది. ఈ సైన్స్ ప్రాజెక్ట్ ను చూడడానికి భీమిలి లో వున్నపాటశాలల నుంచి సుమారు రెండు వేల మంది విద్యార్థులు వీక్షించారు. స్కూల్ హెచ్.ఎం.చిట్టి సింహాచలం మాట్లాడుతూ పర్యావరణ విద్య అనేది ఇప్పుడు అత్యంత ప్రాదాన్యం అని పెరుగుతున్న కాలుష్యం వలన, ప్లాస్టిక్ వాడడం వలన ఉష్ణోగ్రతలు పెరిగి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. పిల్లలకు ఈ ప్రాజెక్ట్ గురించి వివరించారు ఈ కార్యక్రమంలో పాఠశాల సైన్స్ ఉపాద్యాయులు అల్తి.రామకృష్ణ, నయీమ్,సుజాత కుమారి, టీచర్స్ హెల్ప్ గ్రూప్ గౌరవ అద్యక్షులు కంటుబోతు.ముత్యాలరావు, అన్ని పాటశాల ఉపాద్యాయులు, డైట్ విద్యార్థులు పాల్గొన్నారు

# న్యాయమైన కోరికలు పరిష్కరించాలని మీ సేవ సిబ్బంది ఆందోళన

భీమునిపట్నం : భీమిలి మరియు తగరపువలస మీ సేవ కేంద్రం లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని మీ సేవ ఎంప్లాయీస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. న్యాయమైన కోరికలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18 నుంచి నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవు అవుతున్నామని అయినా ప్రభుత్వం ఇంతవరకు స్పందన లేదని కనీస వేతనం చెల్లించాలని దానితో పాటు పి.ఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.స్వచ్చ మైన హామీ ఇవ్వకపోతే ఈ నెల 27 న మీ సేవ కేంద్రాలు బంద్ చేస్తామని మీ సేవ ఎంప్లాయీస్ అసోసియేషన్ పేర్కొంది.ఇందు లో భీమిలి మీ సేవ మేనేజర్ పి. సతీష్ కంప్యూటర్ ఆపరేటర్స్ జి.జయలక్ష్మి, బి. రామ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

**మొదటి పేజీ తరువాయి**

# యుద్ధ విమానంలో కోపైలట్‌గా సింధు

తేజస్ యుద్ధ విమానంలో ప్రయాణించారు. తేజస్‌కు కోపైలట్‌గా సింధు వ్యవహరించినట్లు రక్షణశాఖ ప్రతినిధి తెలిపారు. వైమానిక రంగంలో మహిళలు సాధించిన అద్భుతమైన విజయాలను ఏరో ఇండియాలో ప్రదర్శించనున్నారు. మహిళా సిబ్బంది విమానాలను నడిపి తమ ప్రతిభను చాటుకున్నారు. తేజస్ యుద్ధవిమానానికి కోపైలట్‌గా వ్యవహరించిన తొలి మహిళగా సింధు నిలిచారు. విమెన్స్ డే వేడుకల్లో భాగంగా వ్యోమగామి సునీతా విలియమ్స్ కూడా తేజస్‌లో ప్రయాణించనున్నట్లు తెలుస్తోంది. ఏరో ఇండియాలో శనివారం మహిళా పారాట్రూపర్లు చేసిన ప్రదర్శన హైలైట్‌గా నిలిచింది. మి17 విమానం నుంచి ఐదుగురు మహిళా పారాట్రూపర్లు జంప్ చేసి అందరి దృష్టిని తమవైపునకు తిప్పుకున్నారు. మహిళా పైలట్లు కూడా విమానాలను నడిపి తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏవియేషన్, ఏరోస్పేస్ రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలను ఘనంగా సత్కరించారు. ఏవియేషన్ రంగంలో మహిళా సేవలను కీర్తిస్తూ వారి గుర్తుగా స్టాంపును విడుదల చేశారు. బెంగళూరులోని యలహంక ఎయిర్‌బేస్ స్టేషన్‌లో జరుగుతున్న ఏరో ఇండియా ప్రదర్శనలో భాగంగా ఇటీవల తేజస్‌లో ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ ప్రయాణించిన విషయం తెలిసిందే. తేలికపాటి యుద్ధ విమానం తేజస్ బుధవారమే వాయుసేనలో చేరింది. తేజస్‌ను హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ ఉత్పత్తి చేసింది. గాలిలో ఉండగానే ఇంధనాన్ని నింపుకోవడం, ఎలక్ట్రానిక్ యుద్ధ సూట్లుతో పాటు పలు రకాల బాంబు, ఆయుధాలను కలిగి ఉండటం వంటి ప్రత్యేకతలు దీనికి ఉన్నాయి.

## ఉగ్రదాడిని తుదముట్టిస్తా

పాల్గొన్నారు. పుల్వామా ఉగ్రదాడుల తర్వాత కశ్మీరీలపై దాడులను ఆయన ఖండించారు. అమరులైన సీఆర్పీఎఫ్ జవాన్లకు నివాళి అర్పించిన ప్రధాని నరేంద్రమోడీ... ఉగ్రవాదంపై పోరాడేందుకు కశ్మీరీ యువతను తయారు చేయాలని వ్యాఖ్యానించారు. అదే సమయంలో ఉగ్రవాదం బారిన బాధితులుగా మారుతున్న కశ్మీరీలను కాపాడుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని అన్నారు ప్రధాని మోడీ. పుల్వామా దాడుల తర్వాత కశ్మీరీలపై దాడులు జరుగుతున్నాయి. అలాంటివి ఇకపై జరగకూడదు. ఉగ్రవాదం బారిన పడి వారు కూడా తమ కుటుంబ సభ్యులను కోల్పోతున్నారు. ఉగ్రవాదంపై భారత్ చేస్తున్న పోరాటంలో ప్రతి కశ్మీర్ విద్యార్థి అండగా ఉంటున్నాడు అని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. పుల్వామా ఉగ్రదాడులపై పాకిస్తాన్‌ను ప్రధాని మోడీ హెచ్చరించారు. భారత్ ఎట్టి పరిస్థితుల్లోను మౌనంగా ఉండబోదని సరైన సమయంలో ధీటైన సమాధానం ఇస్తామని మోడీ చెప్పారు.

పాక్ ప్రధానిగా ఇమ్రాన్ ఖాన్ బాధ్యతలు చేపట్టగానే ప్రొటోకాల్‌లో భాగంగా ఆయనకు ఫోన్ చేశాను. ఇప్పటి వరకు భారత్ పాక్ దేశాలు యుద్ధాలే చేశాయి. ఇక నుంచి పేదరికం, నిరక్షరాస్యతపై యుద్ధం చేద్దామన్నాను. ఖాన్ నాడు మాట ఇచ్చారు. ఇప్పుడు సమయం ఆసన్నమైంది. మరి చూద్దాం ఇమ్రాన్ ఖాన్ తన మాటపై నిలబడుతాడో లేదో అని మోడీ అన్నారు. అంతేకాదు పాకిస్తాన్‌కు మద్దతుగా అక్కడక్కడ కొన్ని తుకుడా తుకుడా గ్యాంగ్‌లు ఉన్నాయని వారందరినీ ఏరిపారేస్తామని ప్రధాని మోడీ అన్నారు. పాకిస్తాన్‌పై వడ్డీతో సహా ప్రతీకారం తీర్చుకుంటామని మోడీ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఉగ్రవాదులు ఉగ్రవాదులుగానే ఉన్నారని వారు మారరని చెప్పిన ప్రధాని కశ్మీరీలు ఉగ్రవాదం నుంచి బయటపడాలని కోరుకుంటున్నారని మోడీ చెప్పారు.

# కోడి రామకృష్ణకు మహాప్రస్థానంలో అంత్యక్రియలు

కూతురు దివ్య దీప్తి అంతిమ సంస్కారాలను నిర్వహించి చితికి నిప్పుపెట్టారు. టాలీవుడ్ లెజెండరీ దర్శకుడు, శతాధిక దర్శకుడు కోడి రామకృష్ణ భౌతికకాయానికి అంత్యక్రియలు ముగిశాయి. కుటుంబ సభ్యులు, అభిమానులు అశ్రునయనాల మధ్య హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించారు.

# వైకాపాకు ఓటేస్తే..

టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రత్యేక హోదా అనేది దేశం ఇచ్చిన హామీ అని, రాహుల్ గాంధీ కూడా ఇస్తామని స్పష్టం చేశారన్నారు. ప్రధాని రేపు వచ్చి మాయమాటలు చెప్తానంటే కుదరదని, మనల్ని విమర్శించడానికే వస్తానంటే మాత్రం ఢిల్లీలోనే కూర్చోవాలని హితవు పలికారు. రాష్ట్ర భవిష్యత్ కోసం విభేదాలు వీడి చిరకాల ప్రత్యర్థులు తెదేపాలో చేరుతున్నారని తెలిపారు. ఆదినారాయణ రెడ్డి-రామసుబ్బారెడ్డి, కోట్ల-కేఈ కుటుంబాలే ఇందుకు ఉదాహరణ అని చెప్పారు. 28న ఢిల్లీలో ఎన్డీయేతర పార్టీల సమావేశం ఉందని, ఇందులో భవిష్యత్ కార్యాచరణ ఖరారు చేస్తామని స్పష్టంచేశారు. ఈ ఏడాది 6 నెలల పాటు వరుస ఎన్నికలు ఉంటాయని, పార్టీనేతలు నిత్యం ప్రజల్లోనే ఉండాలని సూచించారు.

*పార్టీ నేతలకు చంద్రబాబు వ్యూహ నిర్దేశం*
*ఎన్నికల వాతావారణాన్ని వేడెక్కిస్తున్న ఏపీ సీఎం*

అధికార విపక్షాల వ్యూహ ప్రతివ్యూహాలు, నాయకుల వలసలతో రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం వేడెక్కిన వేళ రాజకీయాలపై తెదేపా అధినేత చంద్రబాబు పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. ఉదయం నుంచి అర్థరాత్రి దాటేవరకూ నేతలతో ఎడతెరిపి లేని సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఉదయాన్నే దాదాపు 25 వేల మందితో టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని పరిస్థితులను శ్రేణులకు అర్థమయ్యే రీతిలో వివరిస్తూ మార్గనిర్దేశం చేస్తున్నారు. టెలికాన్ఫరెన్స్ ముగిసిన తర్వాత తాజా రాజకీయాలపై వ్యూహ కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నారు. పార్టీలోని కొందరు ముఖ్యనాయకులతో మంత్రాంగం సాగిస్తున్నారు. ముఖ్యంగా తెలుగుదేశాన్ని దెబ్బతీసేందుకు వైకాపా, భాజపా చేస్తున్న విమర్శలను దీటుగా తిప్పికొట్టేందుకు సీనియర్ నాయకులకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఎక్కడైనా కుట్రకోణం దాగి ఉంటే దాన్ని వెంటనే బహిర్గతం చేసేలా సమాయత్తమవుతున్నారు.

# వేర్పాటువాదులపై ఉక్కుపాదం!

ఏర్పాట్లు జరిగిపోతున్నాయి. గత రాత్రి దాదాపు 100 కంపెనీల పారామిలటరీ దళాలను శ్రీనగర్‌కు వాయుమార్గంలో కేంద్ర ప్రభుత్వం తరలించింది. శుక్రవారం వేర్పాటువాద నేత యాసిన్ మాలిక్‌ను అరెస్టు చేయడంతో ఒక్కసారిగా ప్రభుత్వం అప్రమత్తమైంది. కేంద్ర హోం శాఖ అత్యవసర నోటీసులు జారీ చేసింది. వెంటనే రాత్రికిరాత్రే దాదాపు 100 కంపెనీల పారామిలటరీ సిబ్బందిని తరలించింది. పుల్వామ దాడి తర్వాత జమ్ముకశ్మీర్‌లో ఆందోళనకర పరిస్థితులు తలెత్తాయి. ఆ తర్వాత జరిగిన ఎన్‌కౌంటర్లో పుల్వామ సూత్రధారిని భద్రతా దళాలు మట్టుబెట్టాయి. కానీ వేర్పాటు వాదనేతలు ప్రజలను రెచ్చగొడుతుండటంపై ప్రభుత్వం దృష్టి సారించింది. నిన్న యాసిన్ మాలిక్‌తో మొదలైన అరెస్టులు పలువురు జమాత్ ఇ ఇస్లాం నేతల అరెస్టుల వరకు కొనసాగాయి. కీలక నేత అబ్దుల్ హమీద్ ఫయాజ్‌ను కూడా శుక్రవారం అర్ధరాత్రి పోలీసులు అరెస్టు చేశారు.

సోమవారం కీలక తీర్పు..

కశ్మీరీలకు ప్రత్యేక హక్కులను కట్టబెట్టే ఆర్టికల్ 35-ఏపై సుప్రీం కోర్టు ఫిబ్రవరి 25వ తేదీన కీలక తీర్పును వెలువరించనుంది. ఈ నేపథ్యంలో యాసిన్ మాలిక్ , ఇతర జమాత్ నేతల అరెస్టులు కొనసాగుతున్నాయి. పుల్వామా దాడి తర్వాత పలువురు వేర్పాటు వాద నేతలకు భద్రతను ఉపసంహరించుకొన్నారు. వీరిలో యాసిన్ మాలిక్, సయ్యద్ అలీషా గిలానీ, షబ్బీర్ షా, సలీం గిలానీ వంటి నేతలు ఉన్నారు.

# గ్రామీణ ప్రాంతాల్లోను ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

## ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి





సబ్బవరం : గామీణ ప్రాంతాలలోను ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండలంలోని ఆరిపాక గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం వెంకటేశ్వర సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవా శిబిరం నిర్వహించారు. ఈ వైద్య సేవా శిబిరాన్ని పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ముఖ్య అతిధిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి బిపి, షుగర్ టెస్టులు చెకప్ చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోను ఉచిత వైద్య శిబిరాలను ప్రజలందరూ సద్వినియోగ చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శరగడం సాయిఅన్నపూర్ణ, విశాఖ డెయిరీ డైరెక్టర్ శరగడం శంకరరావు, శరగడం మురళి, వి రమేష్‌రాజు, దొడ్డి శ్రీను, పి ప్రకాష్‌తో పాటు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నేతలతో కేటీఆర్ భేటీ..

## డిప్యూటీ స్పీకర్ ఎన్నికపై చర్చ



హైదరాబాద్: కాంగ్రెస్ శాసనసభాపక్ష కార్యాలయంలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డితో తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వీరి మధ్య ఆసక్తికర చర్చ జరిగింది. డిప్యూటీ స్పీకర్ ఎన్నిక నామినేషన్, ఆయన ఎన్నిక ఏకగ్రీవం చేసేందుకు తెరాస ఇతర పార్టీ నేతలతో సంప్రదింపులు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా శనివారం కాంగ్రెస్ పార్టీ నేతలను కేటీఆర్ కలిశారు. శనివారం ఉదయం 9.40 గంటల ప్రాంతంలో మంత్రులు తలసాని, వేముల ప్రశాంత్ రెడ్డితో కలిసి కేటీఆర్ సీఎల్పీ నేత భట్టివిక్రమార్కను కలిశారు. శాసనసభ ప్రారంభం కావడంతో తలసాని, ప్రశాంత్ రెడ్డి అక్కడి నుంచి వెళ్లిపోగా.. కేటీఆర్ మాత్రం అక్కడే ఉన్నారు. అదే సమయంలో ఉత్తమ్ రావడంతో, భట్టి విక్రమార్కతో కలిసి ముగ్గురూ ఏకాంతంగా చర్చలు జరిపారు. డిప్యూటీ స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవానికి మద్దతివ్వాలని వారిని కోరారు.

ఇదే సమయంలో ఎమ్మెల్సీల ఎన్నికల అంశం కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. తమ ఎమ్మెల్యేల సంఖ్యకు ఒక ఎమ్మెల్సీ స్థానం వస్తుందని, అందుకు అధికార పార్టీ సహకారం అందించాలని సీఎల్పీ నేత విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా కేటీఆర్, ఉత్తమ్ మధ్య ఆసక్తికర సంభాషణ జరిగింది. తన నంబర్ ఎందుకు బ్లాక్ చేశారంటూ కేటీఆర్‌ను ఉత్తమ్ సరదాగా ప్రశ్నించారు.

# విజయభాను సంపాదకీయం

## దృఢ సంకల్ప బడ్జెట్

టీఆర్ఎస్ ప్రభుత్వం రెండవ పర్యాయం అధికారానికి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టినది తాత్కాలిక బడ్జెట్ అయినప్పటికీ, బంగారు తెలంగాణను నిర్మించుకోవాలన్న ముఖ్యమంత్రి దృఢ సంకల్పాన్ని ప్రతిబింబిస్తున్నది. ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి సమతూకం కొనసాగుతున్నదనేది స్పష్టమైంది. మొదటి పర్యాయం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు, మ్యానిఫెస్టోలో లేకున్నా ప్రవేశపెట్టిన పథకాలతో పాటు, ఇటీవల ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు అన్నీ తాజా పద్దుల్లో చోటుచేసుకున్నాయి. నిరుద్యోగ భృతి కేటాయింపునకు సంబంధించి ఇంకా విధానాలు ఖరారు కానప్పటికీ, మాటకు కట్టుబడి 3,016 రూపాయల వంతున ఇవ్వడానికి 1,810 కోట్లు కేటాయింపులు చేశారు. ఆసరా పింఛన్ను 2,016కు పెంచారు. దివ్యాంగులకు ఇచ్చే పింఛన్ను 3,016కు పెంచారు. వృద్ధాప్య పింఛను అర్హత వయసును 65 నుంచి 57 ఏండ్లకు తగ్గించారు. ఆసరా పింఛన్ల కోసం 12,087 కోట్లు కేటాయించారు. రైతులకు రుణమాఫీ, రైతు బీమాతోపాటు కులవృత్తుల సంక్షేమం కోసం పథకాలు యథావిధిగా కొనసాగుతున్నాయి. రైతుబంధు పథకం కింద ఇచ్చే పెట్టుబడి మద్దతు ఏడాదికి ఎకరానికి 10 వేల రూపాయలకు పెరిగింది. ఇవన్నీ పరాయిపాలనలో చితికిపోయిన తెలంగాణ సమాజాన్ని తక్షణం ఆదుకోవడానికి ఉద్దేశించినవి. ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోవాలనే ఆధునిక రాజ్య తాత్వికతకు అనుగుణమైనవి. ఇక అభివృద్ధి కోణంలో చూస్తే- మొదటి పర్యాయం పాలన ముగిసి, రెండవ దఫా ప్రారంభమైన సందర్భంగా ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ ఒక సంధికాలానికి సూచిక. గ్రామాలను సంపద సృష్టికి కేంద్రాలుగా, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడానికి మొదటి పర్యాయం పాలన పునాదులను నిర్మించింది. ఈసారి ఆ పునాదులపై బంగారు సౌధాలను నిర్మించుకోవలసి ఉన్నది.

వ్యవసాయరంగానికి తాజా బడ్జెట్లో 20, 107 కోట్లు కేటాయించారు. ఇంత అసాధారణమైన స్థాయిలో ఏ రాష్ట్రమూ వ్యవసాయ రం గానికి కేటాయించలేదు. నీటిపారుదల రంగా నికి 22,500 కోట్లు కేటాయింపు జరిగింది. దీన్నిబట్టి ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయరంగాన్ని గట్టెక్కించడానికి ఎంత పట్టుదలగా ఉన్నారో అర్థమవుతున్నది. అయితే పునాదుల నిర్మాణానికి సంబంధించిన కృషి అంతా ముఖ్యమంత్రి కేసీఆర్ పట్టుదలతో సాధ్యమైం ది. నీటిపారుదల ప్రాజెక్టులకు రూపకల్పన చేయడం, వాటికి నిధులను సమకూర్చడం, అతివేగంగా సమర్థవంతంగా అమలు చేయ డం కేసీఆర్ పాలనాదక్షతకు నిదర్శనం. మొదటి విడుత పాలనలో వ్యవసాయానికి కావలసిన కరెంటు, సాగునీటికి భరోసా ఏర్పడింది. కానీ ఇకముందు కేసీఆర్ ఆలోచనలకు అనుగుణం గా వ్యవసాయరంగం పురోభివృద్ధి చెందాలంటే, రైతుల చైతన్యం ప్రధానం. ఇంతకాలం రైతుకు భూ సారం, నీటి లభ్యతకు అనుగుణంగా ఏ పంటలు వేయాలో, మార్కెట్లో దేనికి డిమాండ్ ఉంటుందో చెప్పేవారు లేరు. పంటకు గిట్టుబాటు ధర రాక వ్యవసాయాన్ని విడిచిపెట్టి కూలీనాలీ చేసుకొని బతుకడానికి పట్నానికి వెళ్ళిన వారున్నారు. కానీ ఇప్పుడు ప్రతి ఒక్క దశలో శాస్త్రీయ విధానాలు అమలుకానున్నాయి. పంటకు డిమాండ్ లేకపోతే, 22.50 లక్షల టన్నుల ఆహార ధాన్యాలను నిలువ చేసే రీతిలో గోదాముల నిర్మాణం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం మార్కెటింగ్ శాఖను కూడా బలోపేతం చేస్తున్నది. స్థానిక ప్రజల అవసరాలు, అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్కు అనుగుణంగా పంటలు పండించడానికి సలహాలు ఇచ్చే ఏర్పాటు ఉంటుంది. మహిళా బృందాలను ప్రోత్సహించి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయిస్తుంది.

క్రాప్ కాలనీల ప్రకారం పంటలను పండించడం, గిడ్డంగులను ఉపయోగించుకోవడం, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను వాడుకోవడం, మార్కెటింగ్ చేసుకోవడం, స్థానిక అవసరాలను తీర్చడం మొదలుకొని విదేశాలకు ఎగుమతులు చేయడం మొదలైన వాటికి రైతులు, స్థానిక సమాజం అలవాటు పడాలె. వ్యవసాయాన్ని మొక్కుబడిగా కాకుండా, లాభసాటిగా చేయాలనే కొత్త వ్యవసాయ సంస్కృతిని అలవరుచుకోవాలె. కక్షలు కార్పణ్యాలకు ముఠా తగాదాలకు తావివ్వకుండా, నిర్మాణాత్మకంగా పరస్పర సహకారంతో వ్యవహరించాలె. గ్రామాల అవసరాలు స్థానికంగానే తీర్చడమనేది ఉత్తమమైన అభివృద్ధి విధానం. ఉదాహరణకు- మన గ్రామంలోనే మిరపకాయలు పండినప్పుడు ఎక్కడో ఏదో కంపెనీ తయారుచేసిన కారప్పొడిని కొనుక్కోవడం ఏమి టి? మన పంటలను, మన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు తయారుచేసి ఇస్తే స్వచ్ఛమైన ఆహార పదార్థాలు లభ్యమవుతాయి. తెలంగాణ ప్రయోగాన్ని మనం విజయ వంతంచేస్తే, దేశాన్ని పీడిస్తున్న వ్యవసాయ సంక్షోభానికి, గ్రామీణ పేదరికానికి పరిష్కారం సాధించినవారమవుతాం.

# బ్రిటన్‌లో మాల్యా ఆస్తుల వివరాలు ఇవ్వండి!



లండన్: విజయ్ మాల్యాకు సంబంధించి బ్రిటన్‌లో ఉన్న ఆస్తుల తాలూకు పత్రాల వివరాలను అందజేసేలా ఆయా సంస్థలను ఆదేశించాలని భారత్‌కు చెందిన 13 ప్రభుత్వ రంగ బ్యాంకులు లండన్‌లో న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. బ్యాంకులు కోరుతున్న ఆస్తుల్లో మాల్యా విలాసవంతమైన యాట్చ్‌లు, రేసింగ్ కార్లు, ఇంతర అంశాలు ఉన్నాయి. వీటి యాజమాన్య వివరాలను వెల్లడించాలని బ్యాంకులు కోరుతున్నాయి. ఈ ఆస్తుల యాజమాన్య హక్కులకు గుర్తించేందుకు కొన్నేళ్లు పట్టవచ్చని బ్యాంకులు భావిస్తున్నాయి. మరోపక్క ఆస్తుల జప్తు వ్యవహారాన్ని నిలిపివేయాలని కోరుతూ బుధవారం మాల్యా లండన్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇప్పటికే భారతీయ బ్యాంకులు తనకు వ్యతిరేకంగా దివాల పిటిషన్‌ను దాఖలు చేశాయని దానిని ఇక్కడ విచారించలేరని పేర్కొన్నారు. ఈ దివాల పిటిషన్ 2019 చివర్లో విచారణకు రావచ్చని భావిస్తున్నారు. 2018 మే 8వ తేదీన బెంగళూరు డెట్ రిజల్యూషన్ ట్రైబ్యూన్ ఇచ్చిన తీర్పును బ్రిటన్ కోర్టులో నమోదు చేసేందుకు ఆ దేశ హైకోర్టు అనుమతి మంజూరు చేసింది. దీంతోపాటు ఇంగ్లాండ్, వేల్స్‌లో మాల్యాకు చెందిన రూ.10,499 కోట్ల విలువైన ఆస్తులను సీజ్ చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను ఆదేశించింది. ఇప్పటికీ విజయ్ మాల్యా పేరుతో ఇంకా భారీగా ఆస్తులు ఉండి ఉంటాయని భారత్‌కు చెందిన బ్యాంకులు గుర్తించాయి. వీటిని సీజ్ చేయడం అధికారులకు సాధ్యం కాలేదు. దీనికి తగ్గట్లే మాల్యా కూడా తన పేరుతో కొన్ని కార్లు, ఆభరణాలు తప్పితే ఏమీ లేవని తెలిపారు. టెవిన్ ఎస్టేట్ తన కుమారుడిదని, లండన్‌లోని టౌన్ హౌస్ తన తల్లిదని పేర్కొన్నారు.

# ఏరో ఇండియాలో భారీ అగ్నిప్రమాదం

బెంగళూరు: ఏరో ఇండియా వైమానిక ప్రదర్శన జరుగుతున్న బెంగళూరు యలహంక ఎయిర్‌బేస్ స్టేషన్ సమీపంలోని పార్కింగ్ ప్రాంతంలో శనివారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో దాదాపు 300కిపైగా కార్లు దగ్ధమైనట్లు అగ్నిమాపక శాఖ అధికారులు వెల్లడించారు. విషయం తెలుసుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పది అగ్నిమాపక దళాలు మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయి. పార్కింగ్ స్థలంలో కొన్ని వందల కార్లు, ద్విచక్రవాహనాలు ఉన్నాయి. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. మంటలు ఉవ్వెత్తున ఎగసి పడటంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ వ్యాపించింది. ఈ పార్కింగ్ స్థలానికి సమీపంలో కొన్ని విమానాలను కూడా ఉంచినట్లు తెలుస్తోంది.

పార్కింగ్ ప్రదేశంలో ఎండు గడ్డి ఉండటంతో మంటలు త్వరగా వ్యాపించాయి. ఏరో ఇండియా గేట్ నంబరు 5 వద్ద ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఘటనా స్థలం వద్ద ఏడు అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు. పార్కింగ్ చేసిన ఓ కారులో మంటలు చెలరేగి పక్కనే ఉన్న కార్లకు వ్యాపించడంతో ఈ ప్రమాదం సంభవించినట్లు తెలుస్తోంది. మంటలు ఆర్పేందుకు ప్రయత్నిస్తున్న కొంతమంది అగ్నిమాపక సిబ్బంది స్వల్పంగా గాయపడ్డారు.

ఒక కారు తర్వాత ఒకటి పేలిపోవడం ప్రారంభించింది. చాలా పెద్ద శబ్దం వినిపించింది.

సెకన్ల వ్యవధిలోనే పార్కింగ్‌లో ఉన్న వేరే కార్లకు మంటలు వ్యాపించాయి. టైర్లు పేలిపోయాయి. నాకు భయం వేసింది. దీంతో అక్కడి నుంచి పరుగులు పెట్టాను. అదే సమయానికి అగ్నిమాపక యంత్రాలు వచ్చాయి అని రహీల్ అనే ప్రత్యక్ష సాక్షి చెప్పుకొచ్చాడు. పార్కింగ్‌లో ఉంచిన చివరి కారు నుంచి తొలుత మంటలు వచ్చినట్లు అతడు చెబుతున్నాడు.

ఈ అగ్నిప్రమాదానికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

# జ్యోతి హత్య కేసు.. ప్రియుడే నిందితుడు





గుంటూరు: గుంటూరు జిల్లా నవులూరు వద్ద జరిగిన అంగడి జ్యోతి హత్య కేసులో ఆమె ప్రియుడు శ్రీనివాసే నిందితుడని పోలీసులు తేల్చారు. శ్రీనివాస్ తన సన్నిహితుడు పవన్‌తో కలిసి జ్యోతిని ఇనుపరాడ్డుతో కొట్టి చంపినట్లు గుంటూరు అర్బన్ ఎస్పీ విజయరావు శనివారం మీడియాకు వెల్లడించారు. పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి తేవడంతో జ్యోతి అడ్డు తొలగించుకునేందుకు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు తెలిపారు. శ్రీనివాస్‌తో పాటు అతడి సన్నిహితుడు పవన్‌ని అరెస్టు చేశామన్నారు. హత్య కేసు నుంచి తప్పించుకునేందుకు శ్రీనివాస్ పకడ్బందీగా ప్లాన్ చేశాడని, పోలీసులు తీవ్రంగా శ్రమించి నిందితులను గుర్తించారని తెలిపారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు.

# రెండతస్తుల భవనంలో పేలుడు.. 11 మంది మృతి

లఖ్‌నవూ : ఉత్తర్‌ప్రదేశ్‌లోని బడోహి జిల్లాలో ఘోర దుర్ఘటన చోటుచేసుకుంది. చౌరీ ప్రాంతంలోని రెండతస్తుల భవనంలో పేలుడు సంభవించి కుప్పకూలింది. ఈ ప్రమాదంలో భవనంలోని 11 మంది మృతి చెందారు. పలువురు శిథిలాల కింద చిక్కుకున్నారు. ఈ భవనంలో తివాచీ పరిశ్రమను నిర్వహిస్తున్నారు. అయితే భవనంలో అక్రమంగా బాణసంచా నిల్వ చేశారని పోలీసులు గుర్తించారు. బాణసంచా పేలడంతోనే భవనం ఒక్కసారిగా కుప్పకూలినట్లు తెలుస్తోంది. ఘటనాస్థలిలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. బాంబు నిర్వీర్య బృందాలు, ఫోరెన్సిక్ నిపుణులు ఘటనాస్థలికి చేరుకొని పేలుడుకు గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. ఆ భవంతిలో భారీగా బాణసంచా నిల్వ ఉంచినట్లు స్థానికులు చెబుతున్నారు.

# సుష్మాస్వరాజ్‌కు అరుదైన గౌరవం

దిల్లీ: భారత విదేశాంగమంత్రి సుష్మాస్వరాజ్‌కు అంతర్జాతీయంగా మరో అరుదైన గౌరవం దక్కింది. ఓఐసీ(ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కో ఆపరేషన్) విదేశాంగ మంత్రుల సమావేశానికి గౌరవ అతిథిగా హాజరుకావాలని సుష్మాస్వరాజ్‌ను ఓఐసీ కోరింది. దీనికి సంబంధించి యూఏఈ(యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్) విదేశాంగ శాఖ మంత్రి షేక్ అబ్దుల్లా బిన్ జావేద్ అల్ నహ్యాన్.. ఓఐసీ ఆరంభ సమావేశంలో సుష్మా స్వరాజ్ ప్రసంగించాలని కోరుతూ ఆహ్వానం పంపారని విదేశాంగ మంత్రిత్వశాఖ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఆహ్వానం పట్ల భారత విదేశాంగ మంత్రిత్వశాఖ స్పందించింది. యూఏఈతో భారత్ ద్వైపాక్షిక సంబంధాలు బలపడటంతోపాటు.. అంతర్జాతీయంగా ఇరు దేశాల భాగస్వామ్యం పెరుగుతాయని వ్యాఖ్యానించింది. యూఏఈ, భారత్ వ్యూహాత్మక భాగస్వామం మెరుగుప డటానికి ఈ ఆహ్వానం దోహదపడుతుందని అభిప్రాయపడింది.

# కవి సమయం

## 'చైతన్య స్వరూపిణి'

సరస్వతీ వైభవం అనంతం
స్మరణ చేతనే మోక్ష సిద్ధి
శుద్ధ ధవళ కాంతులకు ప్రతీక
శ్వేత హంస వాహిని, సత్యగుణ ప్రదాత
సకల విద్యలు, బుద్ధికి అధిష్ఠాత్రి
ఆది పరాశక్తి, సకల జీవులకు జనని
అన్న, ధన ప్రదాయిని, ఆత్మజ్యోతి
జ్ఞానం, విద్య, వాక్కుల స్వరూపం
మేధ, ఆలోచన, ధారణ
స్మృతి, షజ్ఞ, ప్రతిభల కలయిక
భక్తి, భుక్తి మోక్ష ప్రదాయిని శారద

...కవితా రచన
సి.ప్రతాప్
సెల్ నెం: 90636 22665

# పంచాంగం

మాసం : పుష్య; తిథి : పంచమి ప.12.03; స్వాతి రా.తె.3.44; ఉ.వ.9.45ల 11.19.

ఆదివారం 24-02 -2019

**మేషం** : మీ సంతానం విద్య, వివాహ విషయాల పట్ల శ్రద్ధ కనబరు స్తారు. ఉపాధ్యాయులకు యాజమాన్యం ఒత్తిడి అధికం. ప్రముఖుల సహకారంతో ఒక వ్యవహారం సానుకూలమవుతుంది. ప్రింటింగ్ రంగాల వారికి బకాయిలు వసూళ్ళలో శ్రమాధిక్యత, ప్రయాసలు తప్పవు. కష్ట సమయంలో మిత్రులు అండగా నిలుస్తారు. ముఖ్యుల కోసం షాపింగ్ చేస్తారు. వృత్తులు వారికి సామాన్యం. **వృషభం** : నిరుద్యోగులు, వృత్తులు, ప్రింటింగ్ రంగాల వారికి ఆశాజనకం. మీ శ్రీమతి వైఖరి ఆగ్రహం కలిగిస్తుంది. మీ సోదరుల తీరు మీకెంతో మనస్తాపం కలిగిస్తుంది. ఆకస్మికంగా ప్రయాణం చేయవలసి వస్తుంది. ఆత్మీయులకు, చిన్నారులకు విలువైన కానుకలందిస్తారు. వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్సలు పూర్తి చేస్తారు. **మిథునం** : చిట్స్, ఫైనాన్స్, రియల్ ఎస్టేట్ రంగాల వారికి కొత్త ఆలోచనలు స్ఫురిస్తాయి. కొంతమంది మీ వ్యాఖ్యలను అపార్థం చేసుకుంటారు. ఎంతో శ్రమించిన మీదట గాని అనుకున్న పనులు పూర్తి కావు. స్త్రీలు అభిప్రాయాలకు ఆమోదం లభించదు. నిరుద్యోగులకు బోనస్ ప్రకటనల పట్ల అప్రమత్తత చాలా అవసరం. **కర్కాటకం** : విద్యార్థులు ప్రేమ వ్యవహారాల్లో ఇబ్బంది లెదుర్కోవలసి వస్తుంది. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి అన్ని విధాలా యోగదాయకమైన కాలం. రాజకీయ నాయకులు తరచూ సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. పండ్లు, పూల, కొబ్బరి వ్యాపారులకు అనుకూలమైన కాలం. **సింహం** : ఒక వ్యవహారం నిమిత్తం ప్లీడర్లతో సంప్రదింపులు జరుపుతారు. ఉద్యోగంలో శ్రమకు నైపుణ్యతకు మంచి గుర్తింపు లభిస్తుంది. కుటుంబీకుల మధ్య ఆసక్తిరకమైన విషయాలు చర్చకు వస్తాయి. అనుకున్న పనులు కాస్త ఆలస్యమైనా కంగారు పడకండి. **కన్య** : భాగస్వామిక చర్చల్లో కొత్త విష యాలు చోటు చేసుకుంటాయి. స్త్రీలతో సంభాషించేటపుడు ఓర్పు , సంయమనం పాటించండి. బ్యాంకింగ్ వ్యవహారాలలో మెళకువ అవసరం. ఏదైనా స్థిరాస్తి అమ్మకం చేయాలనే మీ ఆలోచన మరి కొంత కాలం వాయిదా వేయడం మంచిది. **తుల** : మీ కావలసిన వస్తువులు లేక పత్రాలు కనిపించకుండా పోయే ఆస్కారం ఉంది. స్త్రీలకు ఆరోగ్యంలో చికాకులు తప్పవు మెళకువ వహించండి. మీ వ్యక్తిగత భావాలకు మంచి స్ఫురణ లభిస్తుంది. ఫాన్సీ, కిళ్ళీ, కిరాణా రంగాలలో వారికి అనుకూలం. ఐరన్, సిమెంటు, కలప, ఇనుము, ఇసుక, ఇటుక వ్యాపారస్తులకు లాభదాయకం. **వృశ్చికం** : నిరుద్యోగులకు బోగస్ ప్రకటనల పట్ల అప్రమత్తత అవసరం. సాంఘిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఒక ప్రకటన మీకు ఎంతో ఆందోళన కలిగిస్తుంది. క్రీడల పట్ల ఆసక్తి పెరుగును. మీ శ్రమకుతగిన ప్రతిఫలం కానవస్తుంది. ఉద్యోగస్తులకు అధికారులతో అవగాహన లోపం, తోటివారి సహకారం లభిస్తుంది. **ధనుస్సు** : మీరంటే అందరికీ గౌరవం ఏర్పడుతుంది. ఆర్థిక పరిస్థితి ప్రోత్సా హాకరం. వృత్తి విద్యా కోర్సులో రాణిస్తారు. మిమ్మల్ని తక్కువ అంచనావేసే వారు మీ సహాయం అర్థిస్తారు. బంగారం, వెండి, లోహ రంగాలలో వారికి మందకొడిగా వుండగలదు. **మకరం** : దేవాలయ, విద్యాసంస్థలకు దాన ధర్మాలు చేయుట వలన మీ కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడిస్తాయి. ప్రముఖులకు కానుకలు, శుభాకాంక్షలందించి వారిని ప్రసన్నం చేసుకుంటారు. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. విద్యార్థు లకు నిరుత్సాహం కానవస్తుంది. వాహనం నడుపునపుడు మెలకువ, ఏకాగ్రత చాలా అవసరం.మీ సంతానం మొండి వైఖరి మిమ్ములను చికాకు పరు స్తుంది. దూరపు బంధువుల ఆరోగ్య విషయంలో ఆందోళన చెందుతారు. **కుంభం** : ఆర్థిక పరిస్థితి ప్రోత్సహకరంగా ఉంటుంది. షేర్ వ్యాపారస్తులకు ప్రోత్సాహం కానవచ్చును. పదవీ స్వీకారాలకు, వృత్తివ్యాపారాల్లో కొత్త వ్యూహాలు అమలుకు అనుకూలమైన రోజు. వ్యవసాయ, ఎగుమతి, దిగుమతులు లాభిస్తాయి. ఒక కార్యం నిమిత్తం దూర ప్రయాణం చేయ వలసి వస్తుంది. పాత రుణాలు తీరుస్తారు. **మీనం** : పాత మిత్రుల కలయిక సంతృప్తినిస్తుంది. తలపెట్టిన పనులలో విఘ్నాలు, చీటికి మాటికి అసహనం ఎదుర్కొంటారు. మీ జీవిత భాగస్వామి సలహా పాటిస్తారు. వస్త్రాలు, విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి వ్యాపారాలలో ఆటంకాలను అధికమిస్తారు. స్త్రీలకు ఆరో గ్యంలో మెళకువ అవసరం. నిరుద్యోగులకు అశాజనకం.



# శబరిమల పదునెట్టాంబడి

## సంకీర్తన

జన్మలన్నింటిలో మానవజన్మను మించింది లేదంటారు. చేసిన తప్పొప్పులకు ప్రాయశ్చిత్తం చేసుకోవాలంటే పద్దెనిమిది సోపానాలను స్పర్శిం చాలి. అప్పుడే సమస్త పాపాలూ హరించబడతాయి. ఆ సోపానాలే పదునెట్టాంబడి. 18 మంది అధి దేవతలు 18 సోపానాలుగా, పదునెట్టాంబడి పేరుతో 18 మెట్లుగా మారిన అద్భుతం శబరిమ లలో మనకు సాక్షాత్కరిస్తుంది.

అయ్యప్ప మాల ధరిం చిన స్వాములు తమ దీక్షకు పరమార్థం సిద్ధించేది పదునెట్టాంబడిని అధిరోహించినప్పుడు మాత్రమే నని నమ్ముతారు. అప్పుడే స్వామివారి దర్శనం, పాపహరణం సాధ్యమవుతుందన్నది వారి విశ్వాసం.

అయ్యప్ప స్వామి దీక్ష తీసుకున్న భక్తులు అత్యంత నియమ నిష్ఠలతో శబరిమల చేరుకుంటారు. స్వామివారి సన్నిధానానికి చేరుకోవాలంటే వీళ్లు పదునెట్టాంబడి పేరుతో పిలువబడే 18 మెట్లను ఎక్కవలసి వుంటుంది.

ఈ 18 సోపానాలు అత్యంత పవిత్రమై నవిగా, శక్తిమంతమైనవిగా వారు భావి స్తారు. నలభై అడుగుల ఎత్తయిన పీఠాన్ని అయ్యప్ప స్వామి అధిరోహించడం కోసం 18 మంది అధి దేవతలు 18 సోపానాలుగా మారారని పురాణాలు చెబు తున్నాయి. ఆ 18 మంది దేవతలు ఛండిక, అన్నపూర్ణ, భద్రకాళి, భైరవి, సుబ్ర హ్మణ్యేశ్వర, గంధర్వ, కార్తవీర్య, తృషనా భాయ, శృతి బేధక, కటు శబ్దక, యుడుంబు, భేతాళ, హరిప్రియ, కర్ణ పిశాచి, పుళిందిని, రేణుక, ప్రదీపిక, ప్రత్యంగిరాలుగా పిలుస్తారు.

మాలధారణ చేయని వారికి ఈ మెట్ల మీదుగా ప్రవేశం వుండదు. మండల దీక్ష తీసుకుని ఇరుముడి కలిగిన భక్తులకు మాత్రమే ఈ సోపానాల మీదుగా స్వామి సన్నిధానానికి రావాలన్నది నియమం.

18మెట్లలోఒక్కోమెట్టుకు ఒక్కో విశిష్టత ఉంటుంది. ఈ మెట్లు గ్రానైట్‌తో నిర్మించినా 1985లో పంచలోహాలతో తాపడం చేశారు. వీటిని పరశురాముడు నిర్మించాడని చెప్తారు.

అష్టదిక్పాలకులు ఎనిమిది మంది(ఇంద్రుడు, అగ్ని, యముడు, నైరుతి, వరుణుడు, వాయువు, కుబేరుడు, ఈశాన్యుడు), రెండు యోగములు (కర్మ యోగం, జ్ఞానయోగం), తరువాతవి విద్య, ఆవిద్య, జ్ఞానం, అజ్ఞానికి రూపాలుగా కూడా ఈ మెట్లను చెప్తారు. ఈ ఆలయంలో స్వామి కొలువైన సందర్భంగా మృదంగ, భేరి, కాహళ, దుందుభి, తుంబురు, మర్దల, వీణ, వేణు, నూపుర, మట్టుక, డిండిమ, ఢమరుక, ఢంక, దవళ, శంఖ, పటహ, జజ్జరి, జంత్‌ర అనే 18 వాయిద్యాలను మ్రోగించారట. ఈ మెట్లను పూజించడాన్నే పడిపూజ అని అంటారు. అయ్యప్ప స్వామి పుట్టుక: ముక్కోటి హిందూ దేవతలలో అయ్యప్ప స్వామి ఒకరు. ఈయనను హరిహర సుతుడని, ధర్మశాస్త, మణికంఠుడని కూడా పిలుస్తారు. శివుడు, విష్ణువుల సంగమం వల్ల పుట్టాడు, కనుక ఈ పేరు వచ్చిందని తెలుస్తోంది.

అయ్య= విష్ణువు, అప్ప = శివుడు అని అర్థం. క్షీరసాగర మథనం అనంతరం విష్ణువు మోహినిగా అవతరించి దేవతలకు, రాక్షసులకు అమృతం పంచడానికి పూనుకుంటాడు.

ఈ క్రమంలోనే అదే రూపంలో విహరిస్తున్న మోహిని పట్ల శివుడు ఆకర్షితుడవుతాడు. అలా శివకేశవుల తేజస్సుతోనే అయ్యప్ప జన్మించాడన్నది పురాణ కథనం. మహిషి అనే రాక్షసిని సంహరించడం కోసం అయ్యప్పకు వీరిద్దరికీ జన్మించాడన్నది ఆయన పుట్టుకలో ఉన్న రహస్యం. ఆ రాక్షసిని చంపి అయ్యప్ప శబరిమలైలో వెలిశాడంటారు. దీక్షా, నియమాలు: భక్తులు కార్తీకమాసం నుండి దాదాపు మార్గశిర, పుష్య మాసాల వరకూ కఠినమైన నియమాలను ఆచరిస్తారు. ఐహికమైన సౌఖ్యాలను త్యజించడం,

సశేషం...

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2564004

## మార్చి2న వెంకట భవానీస్కూల్ వార్షికోత్సవం

విజయనగరం: తోటపాలెంలో గల సాయి తనూస్ వెంకట భవానీ మెమోరియల్ స్కూల్ ప్రథమ వార్షికోత్సవ వేడుకలను మార్చి 2వ తేదీ సాయంత్రం 5 గంటలకు గురజాడ కళాభారతిలో నిర్వహించనున్నామని పాఠశాల కరస్పాండెంట్ కె.రాధ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వార్షికోత్సవంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ బొద్దుల నరసింగరావు, ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ పిఆర్‌సి ఛైర్మన్ డాక్టర్ ఎం. జయచంద్రనాయుడు, జిల్లా పర్యాటకశాఖాధికారి పి ఎన్ వి లక్ష్మీనారాయణ, శ్రీ బాలాజీ టెక్స్‌టైల్ మార్కెట్ అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్ అంచాలియా పాల్గొంటారని అన్నారు. తొలుత వార్షికోత్సవ ఆహ్వానప్రతులను విజయనగరం ఎమ్మెల్యే మీసాల గీత ఆవిష్కరించారు.

## పరవాడలో ఎర్రంనాయుడుజయంతి



పరవాడ:మండలకేంద్రమైనపరవాడలో గల రామసేన కార్యాలయంలో శనివారము ఎర్రంనాయుడు జయంతిసందర్భంగా కూండ్రపుసోమునాయుడుఅధ్వర్యంలో జన్మభూమికమిటిమెంబర్ రెడ్డిశ్రీనువాసురావుమరియుఎర్రంనాయుడు అభిమానులుఎర్రన్న చిత్రపటానికి పూలమాలలువేసినివాళులుఅర్పించారు. అనంతరము అతిథిలుమాట్లడుతూ ఎర్రన్న చేసిన సేవలును కొనియాడారు.అనంతరము పరవాడప్రాదమికఅరోగ్యకేంద్రంలో గల రోగులుకుపండ్లు, రొట్టెలును పంపిణీచేసారు. ఈ కార్యక్రమంలో బొద్దపుఅయ్యాబాబు, వర్రిహరి, చుక్కవెంకటరావు, ప్రవీణ్ ,బండారు రమేష్ మరియు రామసేన సభ్యులు,ఎర్రన్న అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## 25న ఆస్ట్రేలియా ఎడ్యుకేషన్ ఫెయిర్



విశాఖపట్నం : విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే వారికి అవగాహన సదస్సుఈ నెల 25న ఉదయం 11 గంటలకు డైమండ్ పార్క్ సమీపంలో ఉన్న హోటల్ శ్రీ కన్య ఫార్చ్యూన్‌లో నిర్వహిస్తున్నట్లు ఏఇసిసి గ్లోబల్ ఇనిస్టిట్యూట్ రీజనల్ మేనేజర్ భగత్‌రెడ్డి ముడియాలా అన్నారు. శనివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సదస్సులో 12 యూనివర్శిటీల విద్యార్థినీ, విద్యార్థులకు ఆస్ట్రేలియా విద్యాసంస్థలలో అడ్మిషన్స్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని సంస్థ కౌన్సిలర్ సుధ కోరారు.

## అప్పన్నను దర్శించుకున్న హైకోర్టు జడ్జీ



సింహాచలం : సింహగిరి శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారిని హైకోర్టు జడ్జీ ఎం. గంగారావుగారు కుటుంబసమేతంగా శనివారము స్వామివారిని దర్శించుకున్నారు . సింహగిరికి చేరుకున్న వీరికి ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. బేడా ప్రదిక్షణ కప్పస్థంబ ఆలింగనం అనంతరం అంతరాలయంలో అర్చకస్వాములు వీరి గోత్రనామములతో ప్రత్యేక అర్చనలు చేయగా అనంతరం లక్ష్మీ అమ్మవారి దర్శనం చేసుకున్నవీరికి ఆలయ వైదికులు వేద అశీర్వచనం పలుకగా ఆలయఅధికారులు వీరికి స్వామివారి చిత్రపటం ప్రసాదములు అందజేశారు.

## పట్టుబడ్డ కోళ్ల దొంగల ముఠా

ఎస్ రాయవరం : మండలంలోని భీమవరం గ్రామంలో కోళ్ల దొంగతనం చేస్తున్న ముఠాను శుక్రవారం గ్రామస్తులు పట్టుకున్నారు. గ్రామంలో కోళ్ల దొంగతనానికి ఇద్దరు యువకులు ప్రయత్నిస్తున్నారు. వీరిని పట్టుకుని ఆరా తీయగా అనకాపల్లి నుండి ఐదుగురు వచ్చినట్లు తెలిపారు. యలమంచిలి మండలం పులపర్తిలో కూడా కోళ్ళ దొంగతనం జరిగిందనే సమాచారం మేరకు వారిని కూడా పట్టుబడ్డ వారితో రప్పించి కోళ్ళను స్వాధీనం చేసుకున్నారు.స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించినట్లు గ్రామస్తులు తెలిపారు.

## చేతిబోరు ప్రారంభం



పరవాడ : యాభైఅరోవవార్డులంకెలపాలెంలోగల మరిడిమాంబ గుడివద్దచేతిబోరునుశనివారము వేసారు. జిల్లాతెలుగుదేశం పార్టికార్యనిర్వహకకార్యదర్శి రౌతుశ్రీనువాసు రావుఅధ్వర్యంలో ఈకార్యక్రమంజరిగింది. అనంతరముఅయనమాట్లడుతూ ఈబోరు వేయటమువలన భక్తులుకు, చుట్టప్రక్కలప్రజలుకు మరియు లారీ డ్రైవర్స్ కు ఈబోరు ఏంతగానో ఉపయోగ పడు తుందని అన్నారు.బోరువేల్ రావటానికిసహయ సహ కారాలు అందజేసినస్థానికశాసనసభ్యులు బండారు సత్య నారాయణ మూర్తికి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో బొండారమణ,మహలక్ష్మినాయుడు,రౌతురామస్వాం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్‌లో ఆలస్యంగా భోజనాలు

యలమంచిలి రూరల్ : అన్న క్యాంటీన్‌లో భోజనాలు ఆలస్యంగా పెడుతుండటంతో వృద్ధుల సైతం క్యూలో వేచి ఉండాల్సి వస్తోంది. పట్టణంలో అన్న క్యాంటీన్ పనులు పూర్తి కాకపోవడంతో నూతనంగా నిర్మించిన మున్సిపల్ భవనంలో నిర్వహిస్తున్నారు. దీంతో భోజనాలు కోసం వచ్చేవారంతా గంటల తరబడి వేచి చూడాల్సి వస్తుంది. నిర్వహణ లోపం కారణంగా ఇటీవల మధ్యాహ్న భోజనం ఆల స్యంగా పెడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. అన్న క్యాంటీన్‌కు భోజనాలు ఇతర ప్రాంతాల నుంచి సరఫరా అవుతున్నా యని, అందువలనే ఆలస్య మౌతుందని సిబ్బంది తెలిపారు.

# శాంతి భద్రతలపై నిరంతర నిఘా

### - మాకవరపాలెం ఎస్సై కె.రాము



మాకవరపాలెం ; మాకవరపాలెం మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతర నిఘా ఉంచుతామని మాకవరపాలెం ఎస్సై కె.రాము అన్నారు. తాజాగా భాద్యతలు స్వీకరించిన ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రంతో పాటు, తామరం తదితర గ్రామాల్లో ప్రధాన రహదారిపై డివైడర్ ఏర్పాటు ప్రక్రియను త్వరగతిన పూర్తిచేయాలని ఆదేశించినట్లు చెప్పారు. శివారు గ్రామాల్లో కోడిపందేలు, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రతీ చిన్నవాటికి తగాదాలు పెట్టుకోవద్దని, సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఎలాంటి సంఘవిద్రోహ చర్యలు, అసాంఘిక చర్యలపై నిఘా ఉంచుతున్నామని, చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

## సమస్యలు పరిష్కరించాలని సెల్ టవర్ ఎక్కిన విద్యుత్‌శాఖ కార్మికులు



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ సన్యాసిపాత్రుడు



టవర్ ఎక్కిన కార్మికులు

నర్సీపట్నం : పిసిఎఫ్ రద్దు చేసి తమకు సమాన పనికి సమాన వేతం కల్పించాలని డిమాండ్ చేస్తూ విద్యుత్‌శాఖలో ఇంటింటికి తిరిగి మీటర్ రీడింగ్ తీసే కార్మికులు శనివారం నర్సీపట్నం డిఇ కార్యాలయం ఎదుట సెల్ టవర్ ఎక్కి ఆందోళన చేశారు. కరెంటు బిల్లుల వేతనాలను కమిషన్‌ను మార్పు చేసి కనీస వేతనాన్ని పెంచాలని డిమాండ్ చేస్తూ తొమ్మిది మంది కార్మికులు సెల్ టవర్ ఎక్కి ఆందోళన చేశారు. అయితే పోలీసులు రంగప్రవేశం చేసి వారికి నచ్చజెప్పిన కార్మికులు వినిపించుకోలేదు. అలాగే వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పెట్ల ఉమాశంకరగణేష్ వచ్చి తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత మీ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు సెల్ టవర్ వద్దకు ఆందోళన కారులను సముదాయించారు. ప్రభుత్వంతో మాట్లాడి మీకు న్యాయం చేస్తామని చెప్పిన కార్మికులు పట్టువీడలేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి తక్షణ హామీ ఇస్తేనే తప్ప దిగమని స్పష్టం చేస్తున్నారు. మా ప్రాణాలు పోయిన మిగిలిన రాష్టంలో గల కార్మికలకు న్యాయం జరుగుతుందని వారు తేల్చి చెప్పారు. తమ హామీలను యూనియన్ పరంగా మేము కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతామని యూనియన్ నాయకులు జి.కోటేశ్వరరావు తదితరులు, మున్సిపల్ వైస్ చైర్మన్ సన్యాసిపాత్రుడు తెలియజేయడంతో ఆందోళనకారులు శాంతించి కిందకు దిగడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

## వైయస్ఆర్‌సీపీ పార్టీ కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం



భీమునిపట్నం : భీమిలి నియోజక వర్గ వైయస్ఆర్‌సిపి సమన్వయకర్త ముత్తంశెట్టి శ్రీనివాసరావు అవంతి భీమిలి నియోజక వర్గంలో వై యస్ అర్ సి పి ప్రచార కార్యక్రమ లో భాగం గా ఆ నంద పురం మండలం మామిడిలోవ , తరులవాడ వై యస్ ఆర్ సి పి పార్టీ కార్యకర్తల తో ఆత్మీయ సమావేశం నియోజకవర్గ ముఖ్య నాయకుల తో సమావేశం అయ్యారు దీనిలో నియోజక వర్గంలో వు న్న. అన్ని ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు. టీడీపీ పార్టీ నాయకులకు వై యస్ ఆర్ సి పి పార్టీ కండువా వేసి అవంతి శ్రీనివాస రావు పార్టీ లోకి ఆహ్వానించారు. పై కార్యక్రమం లో మండల నాయ కులు. కోరాడ వెంకట రావు , బంక సత్యం, మహేష్, మజ్జి వెంకట రావు, గండ్రెడ్డి శ్రీనివాస్ రావు, రాంబాబు, డోలా దేముడు, రమేష్ , శ్రీకాంత్ రాజ్ మరియు సుమారుగా 100 మంది టీడీపీ కార్యకర్తలు వై యస్ఆర్ సిపిలో జాయిన్ అయ్యారు. ఈ సందర్భం గా ముత్తంశెట్టి శ్రీనివాస రావు(అవంతి) మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో టీడీపీ కి సరైన బుద్ధి చెప్పాలి అని ప్రతి వై యస్ ఆర్‌సిపి కార్య కర్త సైనికులలా కృషి చెయ్యాలి అని నవరత్నాలు కార్య క్రమాన్ని అన్ని గ్రామాలలో విస్తృతంగా ప్రచారం చెయ్యమని కోరారు.

## 74 వ రోజుకు చేరిన దీక్షలు



అనకాపల్లి : అనకాపల్లి మండలం టి. వెంకుపాలెం గ్రామ పరిధిలోని సర్వే నెంబరు 67,68 లో గల భూమిలో సాగు రైతులకు పరిహారం చెల్లించాకే భూములు సేకరించాలనే డిమాండ్ తో జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు కొణతాల సీతారాం చేపట్టిన రిలే దీక్షలు శనివారం నాటికి 74 వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతులు పలువురు మాట్లాడుతూ జనసేన నేత సీతారాం తమ వెంట ఉండి పోరాడకపోతే ఈపాటికి తమకు జరగాల్సిన అన్యాయం జరిగిపోయేదన్నారు. న్యాయం జరిగే వరకూ సీతారాం ఆధ్వర్యంలో తమ పోరాటం కొనసాగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయ కులు రాజనాల శ్రీకాంత్, సురేష్, రాజేష్, రైతులు కుండల లోవరాజు, ఉరుకూటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME
I, NAGABATTULA KRISHNA
S/o. Late N.Samba Murthy
(Old name).
Resident of
D.No.36-93-242/1,
Indiranagar-4,
Kancharapalem Post,
Visakhapatnam
530008.
Shall hence forth be known as
NAGABATHULA KRISHNA
(new name)

దిడ్రైవింగ్ లైసెన్స్ పడిపోయింది
యానాం దరియాలతిప్పకు చెందిన కమిడి సురేష్, తండ్రి కె. ధర్మారావు కు చెందిన డ్రైవింగ్ లైసెన్స్ నెంబర్: పివై 0420120000460 పడిపోయింది. ఈ నెల 13వ తేదీన దరియాలతిప్ప ఇంటివద్ద నుండి మోటారు వాహనంపై ఏటుగట్టు రోడ్డు మార్గంలో యానాం వెళ్తుండగా పరంపేట సమీపంలో పడిపోయింది. ఇది ఎవరికైనా దొరికినయెడలా ఈ క్రింది చిరునామాకు తెలియగోరుచున్నాం.
కమిడి సురేష్,
తండ్రి కె. ధర్మారావు,
డోర్ నెంబర్ 6-3-096,
దరియాలతిప్ప, యానాం.
సెల్ నెంబర్ :
6303607684

## పది తర్వాత చదువే పెళ్లి కాదు



నెక్ట్ ఏంటిని ఆవిష్కరిస్తున్న దృశ్యం

గొలుగొండ జూనియర్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సామాజిక బాధ్యతలో భాగంగా పది తర్వాత కూడా చదువే పెళ్లి కాదు అనే నినాదంతో బాల్యవివాహాలు అరికట్టాలనే లక్ష్యంతో పని చేస్తుందని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ తులసీ రామ్ అన్నారు. చీడిగుమ్మల పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు వాట్ నెక్ట్ కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాంని నిర్వహించారు. ఈ సందర్భంగా తులసీరామ్ మాట్లాడుతూ ఇందులో భాగంగా బాలికలకు భవిష్యత్ మార్గదర్శకత్వం కల్పించడం ద్వారా బాలికలను విద్య పట్ల ఆకర్షితులను చేయవచ్చునని అన్నారు. పది తర్వాత చదువుకోవడానికి ఉన్న అవకాశాలన్ని తెలుసుకొని వ్యక్తిగత ఆసక్తి గల రంగానికి సంబంధించిన చదువును ఎంచుకొని కొన సాగించితే మంచి విజయాలను సాధించవచ్చు నన్నారు. ముఖ్యంగా 10 తర్వాత ఆరు సంవత్సరాలు కష్టపడితే ఉన్నత శిఖరాల అధిరోహించవచ్చునని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జివిఎస్.నాగేంద్ర మాట్లాడుతూ భవిష్యత్ దిశానిర్దేశితను ఏర్పరచు కొనుటకు ఈ అవవగాహన ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ రెడ్‌క్రాస్ సంఘ నాయకులు పప్పు అజయ్, సంఘ నాయకురాలు పట్నాల గంగోత్రి సేకరించిన పది తర్వాత ఏమిటి..? కరపత్రాన్ని విద్యార్థులందరికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ బేతా జోగారావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## అటవీ అనుమతులివ్వాలని వినతి

కొయ్యూరు : వెలగలపాలెం పంచాయతీలో కిత్తాబు రోడ్డుకు అటవీ అనుమతులు ఇవ్వాలని కోరుతూ చింతపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దుశ్చరి చిట్టిబాబు కోరారు. ఈ మేరకు సిపిఎఫ్ రాహుల్‌పాండేకు వినతిపత్రం అందజేశారు. రోడ్డు లేకపోవడంతో కిత్తాబు గ్రామస్థులు పడరాని పాట్లు పడుతున్నారన్నారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. అదే విధంగా గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు.

## విలేకరిపై మంత్రి అయ్యన్న అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా దళిత సంఘాలు ఆందోళన



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దళిత సంఘాల నాయకులు

నర్సీపట్నం : వాస్తవాలు రాసిన విలేకరిపై మంత్రి అయ్యన్న చేసిన అనుచిత వ్యాఖ్యలను విరమించుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ దళిత సంఘాల ఐక్యవేదిక ఆద్వర్యంలో శనివారం నర్సీపట్నంలో ధర్నాలు, రాస్తారోకో చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుండి అబీద్‌సెంటర్ వరకు ర్యాలీ చేసి అక్కడ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. అనంతరం అక్కడ మానవహారం చేశారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ పరుషపదజాలం వాడటం మంచిది కాదని హితవు పలికారు. రాజ్యాంగంలో 30 ఏళ్లుగా మంత్రిగా ఉన్న అయ్యన్నపాత్రుడు దళిత విలేకరిని టార్గెట్ చేసి మాట్లాడటం మంచిది కాదన్నారు. కేవలం ఆసుపత్రిలో అవినీతిపై వార్తలు రాసినందుకే విలేకరిని టార్గెట్ చేసి బహిరంగంగా అవమాన పరిచేలా మాట్లాడారని నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. నాలుగు బ్యాటరీ దొంగలించినవారిని అరెస్టు చేసి జైల్లో పెట్టిన వారు కోటి రూపాయలు ఆసుపత్రి నుంచి దొంగిలించిన డాక్టర్లపై ఎందుకు చర్యలు తీసుకోలేదని సవాల్ విసిరారు. అనంతరం వీరంతా ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ చేసి అక్కడ పరిపాలానాధికారికి వినతిపత్రం అందజేశారు. జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం పంపి మంత్రి అయ్యన్నపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత కులాల సంక్షేమ సేవా సంఘం నాయకులు చిట్ల చలపతి, యాదగిరి దాసు, నేతల నాగేశ్వరావు, సహదేముడు, వేములపూడి నూకరాజు, దళిత హక్కుల జిల్లా పోరాట సమితి జిల్లా సహాయ కార్యదర్శి మార్తి అప్పలరాజు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మానవహారం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

# ప్రత్యేక హోదాకై జెండాగరువులో బారి సమావేశం



అరకులోయ : నియోజక వర్గ అనంతగిరి జెండాగరువులో ప్రత్యేక హోదా కోసం అరకు లోయ నియోజక వర్గ కాంగ్రెస్ మహిళా అధ్యక్షు రాలు పాచిపెంట.శాంతకుమారి ఆద్వర్యంలో శనివారం నాడు బారి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి వాడలో ప్రతి గ్రామంలో రోడ్డు వంతెన లేని గ్రామాలకు వంతెన సౌకార్యం ఉచిత విద్యుత్తు, ఇంటికి కొళాయి, ప్రతి డ్వాక్రా మహిళాకి రుణా మాఫీ కింద 2 లక్షల రూపాయలు ప్రతి పేదోడికి ఇల్లు, ప్రతి వితంతు వీడో మహిళాకి వృద్దులకు వికలాంగులకు 3 వేల రూపాయలు పెన్షన్ అని అన్నారు అలాగే రైల్వే జోన్ వస్తే మన ప్రాంతంలో గల చదువుకున్నా నిరుపేద గిరిజన యువతి యువకులకు ఉద్యోగాలు వస్తాయి అన్నారు.అలగే రాహుల్ గాంధీ తొలి ప్రధాని అయితే ప్రత్యేక హోదా కోసం తొలి సంతకం చేస్తారు అని అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు దేశంలో ఉపాధిహామీ పని తెచ్చి ప్రతి పేదోడికి ఆర్దికంగా ఆదు కున్నారని,దేశానికి రాష్టనికి ఎన్నో పథాకాలు తెచ్చి దేశం ఆర్థికంగా అభివృధి చెందింది అన్నారు అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే అన్ని రకంగా ప్రతి పేదోడికి మేలు జరుగుతుంది అన్నారు.అలాగే అరకు ఇంచార్జీ గంపరాయి. సూరయ్య కుడా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు అంతులేని పథాకాలు. ఉద్యోగాలు భర్తీ చేశారు అన్నారు. వై.ఎస్.అర్ ప్రభుత్వం వచ్చినా తెలుగుదేశం ప్రభుత్వం వచిన రాష్ట్రం అభివృధి చెందడం కష్టం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే దేశం రాష్ట్రం అభివృధి చెందుతుంది అన్నారు. ఈ సమావేశం కాంగ్రెస్ పార్టీలోకి బారి సంఖ్యలో కార్యకర్తలు చేరికలు జరిగాయి. వీరిని అరకులోయ నియోజక మహిళా అధ్యక్షురాలు పాచిపెంట.శాంతకుమారి కండువా కప్పి పార్టిలోకి ఆహ్వానించారు. ఈ సమావేశంలో అరకు ఇంచార్జీ గంపరాయి. సూరయ్య, అనంతగిరి మండల ప్రెసిడెంట్ నరాజి.గోవిందారావు అరకు సెక్రెటరీ శెట్టి.భగత్ రాము పి.సి.సి మెంబర్ మతం.పరశురాము అభిమానులు కార్యకర్తలు పాల్గొని ప్రత్యేక హోదా కాంగ్రెస్తోనే సాధ్యం అన్నారు.

# ఎన్ఎఫ్ఎస్జె సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ మహిళా అధ్యక్షురాలుగా: సుశీల కుమారి



ములగాడ: నేషనల్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ ఆంధ్ర ప్రదేశ్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ మహిళా అధ్యక్షురాలుగా ఉప్పినవలస సుశీల కుమారి నియమిస్తూ నేషనల్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ జాతీయ అధ్యక్షులు నెల్లిగురుదేవ్ జీ నియామక పత్రాన్ని విడుదల చేశారు ఈ విషయంపై నేషనల్ ఉమెన్ వింగ్ స్పోక్స్ పర్సన్ డాక్టర్ నాగమల్లేశ్వరి ఈ నియామక పత్రాన్ని ఆమెకు అందించారు సుశీల కుమారి కరాటి స్కాట్ డెడ్ క్రీడల్లో గవర్నర్ భారత రాష్ట్రపతి చేతుల మీదగా అవార్డులు పొందడమే కాకుండా కరాటేలో ఎన్నో సాహసాలు చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరాటి లో పలువురికి శిక్షణ ఇస్తూ నా చిన్నతనం నుంచే ఇలాంటి విద్యను ఎన్నో నేర్చుకొని జాతీయ పురస్కారం అవార్డు లను పొంది ఉన్నానని ఈ నమ్మకంతోనే పారిశ్రామిక ప్రాంతంలో యువతీ యువకులకు శిక్షణ అందిస్తూ వారందరూ ఉన్నత శిఖరాలకు వెళ్లారని దీనిని గుర్తించి నాపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని నాకు ఈ బాధ్యతలు అప్పగించిన జాతీయ నాయకులకు మరియు విశాఖ మీడియా కోఆర్డినేటర్ యు వెంకటేశ్వరరావు జాతీయ కార్యదర్శి జయశ్రీ బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు రాజేష్ విశాఖ ఓబిసి యూత్ నాయకులు మణికంఠ ఎస్సీ వింగ్ యూత్ అధ్యక్షులు అన పర్తి సైదా సుదర్శన్ కృతజ్ఞతలు తెలియజేశారు.

# నేడే అచ్యుతాపురంలో వైసీపీ విజయోత్సవ సభ

## హాజరుకాన్ను విజయసాయిరెడ్డి, బొత్స సత్యనారాయణ

యలమంచి: నేడు అధివారం పోలీసు స్టేషన్ ఎదుట గ్రౌండులో ఉదయం 10 గంటలకు వైసీపీ నియోజకవర్గం బహిరంగ సభ జరుగుతుందని యలమంచిలి వైసీపీ సమన్వయకర్త కన్నబాబు రాజు అన్నారు. ఈ సభకు రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, రాష్ట్ర వైసీపీ నాయకులు బొత్స సత్యనారాయణలు ముఖ్య అతిధులుగా హాజరు కానున్నరని కన్నబాబు తెలిపారు. ఈ నియోజకవర్గంలో రావాలి జగన్ కావాలి జగన్ వైసీపీ ఇంటింటి ప్రచారం కార్యక్రమం అదివారంతో పూర్తి అవుతుందని కన్నబాబురాజు అన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలు చైతన్య పరచాలనే ఉద్ధేశ్యంతో బహిరంగ సభను నిర్వహించాలని కన్నబాబురాజు భావిస్తున్నారు. ఈ నేపధ్యంలో అయా మండల వైసీపీ నాయకులతో చర్చించి సమావేశాన్ని ఖరారు చేశారు. ఈ సభకు వైసీపీ రాష్ట్ర నాయకులు విజయసాయిరెడ్డి, బొత్స సత్యనారాయణలు ముఖ్యఅతిధులుగా హాజరవుతారని కన్నబాబు రాజు తెలిపారు. ఈ సభను విజయవంతం చేయడానికి వైసీపీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని కోరారు. వైసీపీ అధినేత జగన్మోహన్రెడ్డిని సిఎంగా చేయడానికి యలమంచిలి నియోజక వర్గంలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. యలమంచిలి నియోజకవర్గంలో జగనన్న ప్రజా సంకల్పయాత్రను ఎంతో విజయవంతం చేశారని అదే స్ఫూర్తితో వైసీపీ కార్యక్రమాలు ఫలప్రధం చేయాలని కన్నబాబురాజు కోరారు. రాష్ట్రంలో యలమంచిలి నియోజకవర్గం నుండి భారీ మేజార్టీ సాధించే దిశగా ఫ్యాన్ గుర్తునకు ఓటు వేసే విధంగా శక్తి వంచన లేకుండా పనిచేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# దళితులను కించపరిస్తే సహించం

## -నాతి సత్యనారాయణ



కాట్రేనికోన : కాట్రేనికోన మండలం పల్లంకుర్రులో శనివారం వైయస్సార్ కాంగ్రెసు పార్టీ నాయకుడు నాతి సత్యనారాయణ ఆధ్వర్యంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. దళితులను కించపరిచే వ్యాఖ్యలు చేయడం సరి కాదని, దళితులన కించపరిస్తే సహించేది లేదని నాతి సత్యనారాయణ అన్నారు. కాట్రేనికోన మండల వ్యాప్తంగ పల్లంకుర్రు, కందికుప్ప, దొంతుకుర్రు, కాట్రేనికోన గేటు సెంటర్లో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అలాగే పల్లంకుర్రు నుండి కాట్రేనికోన గేటు సెంటర్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సంఘటనను తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్యే అయ్యిఉండి ఇటు వంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఈకార్యక్రమంలో మండల వైయస్సార్ కాంగ్రెసు పార్టీ నాయకులు నాతి సత్యనారాయణ, నల్లా నరసింహమూర్తి, శ్యాంప్రసాద్,చక్రి, ఇసుకపట్ల శ్రీనుబాబు మండల వైయస్సార్ కాంగ్రెసు పార్టీ నాయకులు,మండలంలో దళిత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు ఆంగ్ల బోధనపై శిక్షణ

యలమంచిలి: పాఠశాలలో 1, 2వ తరగతిలో విద్యార్థులకు నాణ్యతాపరమైన ఆంగ్ల విద్యను అందించేందుకు జోనల్ వాయిస్ శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు యలమంచిలి మండల విధ్యాశాఖ అదిరాకి ఎంఎస్ఎన్ మూర్తి అన్నారు. యలమంచిలి పట్నంలో చైతన్య విద్యా సంస్థలు ప్రాంగణంలో ఉపాధ్యాయులకు రెండు టీములుగా, అలాగే స్టేషన్ రోడ్డు జిల్లా పరిషత్ హైస్కూల్లో మరొక రెండు టీమ్లకు శనివారం నాడు, అదివారం నాడు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న స్టేట్ రిసోర్స్ పర్సన్ సిహెచ్ఎం. దొర మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నెంబర్ నెలలో ఐదురోజుల పాటు జరిగే ఈ శిక్షణ తరగతులకు మందుగా పూర్వ తయారీ చేసేందుకు మూడు విడతలుగా ఈ రెండు రోజులు, మార్చి 13, 14, ఏప్రిల్ 2, 3 తేదిలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఈ శిక్షణా తరగతులు పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్. రాయవరం, యలమంచిలి, రాంబిల్లి, అచ్యుతా పురం, మునగపాక, కశింకోట, అనకాపల్లి ఈ 9 మండలాలలో గల పాఠశాల 1, 2 తరగతుల ఉపాధ్యాయులకు సమాంతర ఆంగ్ల మధ్యమ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని దీని ద్వారా ఉపాధ్యాయులలో ఇంగ్లీష్పై సామర్థ్యం పెంపొందించుకున్నారు 9 మండలాల నుండి 188 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారని అన్నారు. నవంబరు 28 నుండి డిసెంబర్ 2 వరకు జరిగే శిక్షణలో జిల్లాలో గల 620 పాఠశాల నుండి ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ నాగేశ్వరరావు, విశాలాక్షి, మండల కో-ఆర్డినేటర్ దొడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.

# వృద్ధులకు అన్నదానం



యానాం: యానాం ఎలక్ట్రికల్ రివైడింగ్ వర్కర్స్ ఆసోసియేషన్ ఆధ్వర్యంలో వృద్ధులకు అనమ్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఓల్డేజ్ హెూంలో పుదుచ్చేరి ఆరోగ్య శాఖ మంత్రి, ఓల్డేజ్ హెూం వ్య వస్థాపక అధ్యక్షుడు మల్లాడి క్రిష్ణారావును అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు దుశ్శాలవలు, పూలమాలలు, మెమోంటాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఓల్డేజ్ హెూంలో వృద్ధులకు, చిన్నారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నూతన అధ్యక్షులుగా పొన్నమండ దేవేందర వర్మ, ఉపాధ్యక్షులుగా నీలం గోవిందరాజు, కార్యదర్శింగా కర్రి సత్తిబాబు, సహాయ కార్యదర్శిగా బొమ్మిడి శ్రీనివాసరావు, కోశాధికారిగా కముజు వెంకట బాలమురళీకృష్ణ, సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరిని మంత్రి మల్లాడి అభినందించారు.



29 మరియు 30 వార్డులలో జనసేనా పార్టీకి చెందిన జెండాలు, ఫెక్సీలు చింపి వేసినందుకు నిరసనగా శనివారం సూర్యాబాగ్ జివిఎంసి కార్యాలయంవద్ద జనసేన నాయకులు ధర్నాచేశారు. కొందరి ఆగడాలు రోజురోజుకూ మితిమీరిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ధర్నాలో జనసేన పార్టీ సమన్వ యకర్త గంపల గిరిధర్, శివ, శేఖర్, నాని, భరత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

యానాం: నియోజకవర్గంలోని కోట్లాది రూపాయల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులను పుదచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు శంకుస్థాపనలు చేశారు. కనకాలపేట, మెట్టకూరు, దరియాలతిప్ప, పలు గ్రామాలలో శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాపనుల శాఖ ఇఇ రాందాసు, మున్సిపల్ కమీషనర్ జి. గౌరీసరోజ, ఎఇ మేడిశెట్టి రామలింగేశ్వరరావు, జెఇ మనోహర్, పిడబ్ల్యుడి జెఇలు కాళహస్తి జ్యోతిరాజు, కాళ నాగరాజు, ఎంవై హుసేన్, పలువురు అధికారులు, తదితరుల పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత నగరంగా విశాఖ

## - అదనపు కమిషనర్ (జనరల్) జివివియస్ మూర్తి



విశాఖపట్నం: విశాఖ నగరాన్ని ప్లాస్టిక్ రహిత నగరంగా రూపొందించడంలో ప్రజలు సహకరించాలని జివియంసి అదనపు కమిషనర్ (జనరల్) జివివియస్ మూర్తి పిలుపునిచ్చారు. సీతమ్మధార రైతుబజార్లో శనివారం ఆయన స్వచ్ఛ అంబాసిడర్స్తో కలసి ప్రజలను చైతన్యవంతం చేశారు. ఈ సందర్భంగా ప్రజలు వినియోగించే ప్లాస్టిక్ సంచులను తీసుకొని గుడ్డ సంచులను పంపిణీ చేశారు. 0.50 మైక్రాన్ల కంటే తక్కువ మందం కల ప్లాస్టిక్ సంచులను వాడరాదని పేర్కొన్నారు. ప్లాస్టిక్ సంచులను బదులుగా గుడ్డ సంచులు, పేపర్ బ్యాగ్లు వాడాలని హితవు పలికారు. అవగాహనా కార్యక్రమంలో స్వచ్ఛ విశాఖ అంబాసిడర్స్ డా.షిరీన్ రెహమాన్, డా.పి.విశ్వేశ్వరరావు, ప్రొఫెసర్ వి.బాలమోహన్ దాస్, వి.వి రమణమూర్తి, ప్రొఫెసర్ జి.యస్.ఎన్ మూర్తి, పి.ఎల్.కె మూర్తి, జె.జె వల్సరాజ్, డిసిఆర్ సోమన్నారాయణ, సూపరింటెండెంట్ పైడిరాజు, యస్.ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గోన్నారు.

# రానున్న ఎన్నికల్లో కేంద్ర రాష్ట ప్రభుత్వాల్ని గద్దె దించడమే లక్ష్యం: సిపిఐ (ఎంఎల్)





యు కొత్తపల్లి : కొత్తపల్లి మండలం వాకతిప్ప గ్రామంలో స్థానిక సిపిఐ (ఎంఎల్) కార్యదర్శి శీలం అప్పలరాజు అధ్యక్షతన శనివారం స్థానిక కమిటీ మహా నిర్వహించడం జరిగింది . సిపిఐ (ఎంఎల్ )కేంద్ర కార్యదర్శి నైనాలశెట్టి మూర్తి మాట్లాడుతూ దేశంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యం అని గొప్పలు చెప్పుకునే మనదేశంలో ప్రజాస్వామ్యం పేరుతో ధనిక స్వామ్యం రాజ్యమేలుతుందని ఆయన ఎద్దేవా చేశారు. ధనికులు, స్వార్థపరులు పార్లమెంట్ అసెంబ్లీలకు వెళుతున్నారే తప్ప. పేదవాడు ఎవరైనా ఎమ్మెల్యే గాని ఎంపీగా గాని ఉన్నాడా అని గుర్తు చేశారు . 2014 ఎన్నికల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మేనిఫెస్టోలో చెప్పిన వాగ్దానాలన్నీ తుంగలో తొక్కి ఈరోజు అధికారం కోసం మరొకమారు బూటకపు వాగ్దానాలు చేసి ఎన్నికల్లో గెలిచే ప్రయత్నం చేస్తున్నారని వీరి మాటలు నమ్మవద్దని ఆయన హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో అత్యంత శక్తివంతమైన ఓటు అనే ఆయుధంతో బిజెపి తెలుగుదేశం పార్టీలను ఓడించి సిపిఐ (ఎంఎల్ )పార్టీ ని గెలిపించ వలసిందిగా ఈ సభ ద్వారా ప్రతి ఒక్కరిని కోరుతున్నానని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎం.ఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి కె. గణేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు గొడుగు సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు వి. నాగమణి, జె.ఎస్.ఎం నాయకులు పల్లా శీను, మరియు వాకతిప్ప అమీనాబాద్ నుండి పార్టీ సభ్యులు పాల్గొన్నారు. 11 మంది కార్యకర్తలతో స్థానిక కమిటీ సభ్యులు శీలం అప్పలరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# నూతన పరిపాలనాధికారిగా శివరాజు మీనా

యానాం: యానాం నూతన పరిపాలనాధికారిగా శివరాజు మీనా బాధ్యతలు స్వీకరించారు. శనివారం ఉదయం పరిపాలనాధికారి కార్యాలయంలో ఆయన ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. పరిపాలనాధికారిగా పనిచేస్తున్న దవులూరి సుబ్రమణ్యేశ్వరరావు పుదుచ్చేరికి బదిలి అయ్యారు. ఈ నెల 28తో ఉద్యోగ బాధ్యతల నుండి విరమణ అవుతున్నప్పటికీ ఆయనను ఇక్కడ కొనసాగించకుండా పుదుచ్చేరికి బదిలీచేయడం పట్ల పలు ఉద్యోగ సంఘ నాయకులు తమ నిరసన తెలియజేశారు. నూతన పరిపాలనాధికారిగా బాధ్యతలు చేపట్టిన శివరాజు మీనా పుదుచ్చేరి ఆరోగ్యశాఖమంత్రి మల్లాడి క్రిష్ణారావును ఎర్రాగార్డెన్స్లో ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. పరిపాలనాధికారి కార్యాలయంలో ఆయనను మున్సిపల్ కమీషనర్ జి. గౌరీసరోజ, ప్రజా పనుల శాఖ ఇఇ రాందాసు, వివిధ శాఖలకు చెందిన అధికారులు కలిసి అభినందించారు. వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# గిరిజనుల ద్రోహి బాబు.. గిరిజనులకు న్యాయం చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైస్సార్

## - గిరిజన ఆత్మీయ సదస్సులో పలువురు నేతలు



అనంతపురం: సీఎం చంద్రబాబునాయుడు గిరిజన చట్టాలకు తూట్లు పొడుస్తూ గిరిజనలకు కనీస ప్రాధాన్యత ఇవ్వకుండా కక్షతో వ్యవహరిస్తున్నారని గిరిజనులకు ద్రోహిగా మారారని వైస్సార్సీపీ గిరిజన విభాగం రాష్ట్ర నాయకులు విమర్శించారు. శనివారం ఉరవకొండలో వైస్సార్సీపీ ఆధ్వర్యంలో గిరిజన ఆత్మీయ సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి ప్రణయ్ రెడ్డి ,గిరిజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలెం జయరాం నాయక్, రాష్ట్ర కార్యదర్శి బోజరాజు నాయక్, వైస్సార్సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరన్న హాజరయ్యారు. ముందుగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్సార్ బ్రతికున్నప్పుడు గిజనులకు చేసిన మేలును గుర్తుకు చేసుకున్నారు. వైస్ రాజశేఖర్ రెడ్డి గిరిజనులకు అత్యదిక ప్రాధాన్యత ఇచ్చి సంక్షేమ కార్యక్రమా లు అమలు చేసి వారికి ఆరాధ్య దైవంగా మారా రని అన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సైతం గిరిజన ప్రాంతాలలో పర్యటించినపుడు అక్కడి బాదలు తెలుసుకుని వారికి ఆరోగ్య, విద్యవ కాశాలు కల్పించాలని నిర్ణయించుకుని రాష్ట్రం లోని ఐటిడిఏల పరిదిలో సూపర్ స్పెషాలిటి ఆస్పత్రి,మెడికల్ కాలేజ్, ఇంజనీరింగ్ కాలేజీలను ప్రారంభిస్తామని ప్రకటించారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికలలో గిరిజనులు వైఎస్సార్ కాంగ్రెస్ పక్షాన నిలబడాలని వారు పిలుపునిచ్చారు. బాబు మోసా లను ఇంటింటికి తీసుకెళ్ళాసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం గిరిజనుల అభివృద్ధి కోసం పలు తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ గిరిజన నాయకులు సుంకే నాయక్,గోవిందు నాయక్, కేశవ నాయ క్, ప్రసాద్ నాయక్, విజయ్ కుమార్ నాయక్, నాగరాజు నాయక్, రవినాయక్, వెంకటేష్ నాయక్, తులసి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# స్టెర్లింగ్ హెయిట్స్ అపార్డ్మెంట్ సమస్య పరిష్కారానికి చర్యలు

## - కమిషనర్ హరినారాయణన్



విశాఖపట్నం: స్టెర్లింగ్ హెయిట్స్ అపార్ట్మెంట్ వాసుల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోంటున్నట్లు జివియంసి కమిషనర్ హరి నారాయణన్ పేర్కొన్నారు. శనివారం స్టెర్లింగ్ హెయిట్స్ అపార్ట్మెంట్ను సందర్శించి సమస్యలను విన్నారు. ఈ సందర్భంగా నేతివిందు హెూటల్ వలన కలిగే ఇబ్బందులను పరిశీలించారు. నేతి విందు హెూటల్ యజమానికి నెల రోజుల సమయంలో సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రజలకు ఆరోగ్య సమస్యలు, అసౌకర్యం కలుగకుండా చూడవలసిన బాధ్యత హెూటల్ యాజమాన్యానిదని అభిలషించారు. సిసిపి విద్యుల్లత, ఏసిపి సత్యనారాయణ, అపార్ట్మెంట్స్ ప్రతినిధులు కె.ఆర్.కె రావు, నేతివిందు హెూటల్ యజమానితో కలసి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు.

జర్నలిస్టులకు సీఎం ఇచ్చిన హామీలు

# వెంటనే నిలబెట్టుకోవాలి

## న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని జర్నలిస్టుల దీక్ష



విశాఖపట్నం : న్యాయపరమైన జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలంటూ లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జివిఎంసి సమీపంలో గాంధీ విగ్రహం వద్ద దీక్షా కార్యక్రమాన్ని జర్నలిస్టులు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండేళ్ల కిందట నంద్యాల ప్రచారంలో అర్హులైన జర్నలిస్టులకు మూడు బెడ్‌రూంలు గల ఇళ్లు, కోరుకునే వారికి 300 గజాల ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అయితే ఆ హామీ ఇచ్చి రెండేళ్ళైనప్పటికీ ఆ హామీలు నిలబెట్టుకోకపోవడం చాలా బాధాకరం. గత ఏడాది దీనికి సంబంధించి 100 కోట్ల కేటాయింపుతో పాటు దీని విధి విధానాలతో కూడిన జివో విడుదల చేయడం జరిగింది. 1200 చదరపు అడుగుల ఇంటికి సంబంధించిన రేటును ఇప్పటికీ నిర్ణయించలేదన్నారు. కొద్ది రోజుల్లో ఎన్నికల రానున్న నేపథ్యంలో ఇచ్చి నహామీలు హామీలుగానే మిగిలిపోతున్నందున ఈ హామీలు నెరవేర్చాలని కోరుతూ ధర్నా చేయడం జరిగింది. ఈ ధర్నాలో లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలు ప్రాంతాలకు చెందిన జర్నలిస్టులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియోషన్ కన్వీనర్ పి. సత్యనారాయణ, విజెఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, కార్యదర్శి దుర్గారావులతో పాటు అధిక సంఖ్యలో జర్నలిస్టులు , ఫొటోగ్రాఫర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## స్మార్ట్‌సిటీ మిషన్ స్మార్ట్ రోడ్స్ అర్బన్ స్ట్రీట్ గైడ్‌లైన్ ప్రకారం నిర్వహించండి

### - కమిషనర్ హరినారాయణన్

విశాఖపట్నం : స్మార్ట్‌సిటీ మిషన్ లో భాగంగా స్మార్ట్‌రోడ్స్‌ను హార్బర్‌పార్కు - ఆర్.కె.బీచ్ రోడ్, ఆకాశవాణి-పాండురంగాపురం రహదారుల పనులను జివియంసి కమిషనర్ హరినారాయణన్ శనివారం పరిశీలించారు. ఎటువంటి లోపాలు లేకుండా రహదారులను నిబంధనల ప్రకారం నిర్వహించాలని ఆదేశించారు. పర్యటనలో అయికాం డైరక్టర్ ప్రభు, యస్.ఇ వినయ్‌కుమార్, ఇ.ఇ సుధాకర్, ఏసిపి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




## ఊటగెడ్డ పరిసరాలను స్మార్ట్ పార్క్‌గా రూపకల్పన

### - కమిషనర్ హరినారాయణన్



విశాఖపట్నం: స్మార్ట్‌సిటీ మిషన్ క్రింద ఊటగెడ్డ పరిసరాలను రెండు దశల్లో స్మార్ట్ పార్క్‌గా తీర్చిదిద్దనున్నట్లు జివియంసి కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. ఊటగెడ్డ కమ్యూనిటీ హాలులో శనివారం ఆయన ఊటగెడ్డ సుందరీకరణ, పార్కు, నడకదారులు, లాన్స్, ఆర్నమెంటల్ ప్లాంట్స్‌తో దివ్యాంగులతో సహా అందరికి ఆహ్లాదం, ఆరోగ్యం పంచే విధంగా రూపొందించనున్నట్లు వివరించారు. చేపట్టే పనుల వివరాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా స్థానికులకు వివరించారు. సిటిజన్ ఎంగేజ్‌మెంట్ కార్యక్రమం క్రింద దసపల్లా రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో సమావేశమైనారు. సుందరీకరణ అభివృద్ధి లో పౌరులను భాగస్వాములను చేయడం లక్ష్యంగా పేర్కొన్నారు. ఇప్పటికే స్మార్ట్ సిటీ క్రింద ఆల్ ఎబిలిటీస్ పార్క్, చినవాల్తేర్ పార్కు, విజయనగర్ కాలనీ పార్కు, డచ్‌పార్క్ లను అభివృద్ధి చేసి ప్రజల సౌకర్యార్థం ప్రారం భించినట్లు, ప్రజల నుండి ప్రశంసలు వస్తున్నట్లు వివరించారు. వరుణ్‌బజాజ్, నోవాటెల్ హోటల్ మెనేజింగ్ డైరక్టర్ ప్రభుకిశోర్, అమ్మాజీ, గోపాలరాజు, జి.జెవల్సరాజ్, ఆర్‌డబ్ల్యుఏ సభ్యులు, అయికాం డైరక్టర్ ప్రభు, స్మార్ట్‌సిటీ మేనేజర్ ఆనంద్, యస్.ఇ వినయ్‌కుమార్, ఇ.ఇ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపిఇఒలకు ఉద్యోగ భద్రతకై కలెక్టరేట్ వద్ద ఆందోళన

విశాఖపట్నం: వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న ఎం.పి.ఇ.ఒ (బహుళ ప్రయోజన విస్తరణ అధికారి)లకు ఉద్యోగభద్రత కల్పించాలని గత వారం రోజులుగా పెన్ డౌన్ కార్యక్రమం నిర్వహించినా ప్రభుత్వం నుండి ఎంటువంటి సానుకూలతా రాకపోవడంతో నేడు విశాఖజిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించడమైనది. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 2015లో వ్యవసాయ శాఖలో నియమించింది. ప్రభుత్వం వ్యవసాయ రంగంలో నిర్వహించే అన్ని పథకాల అమలు, రైతులకు వచ్చే అన్ని రకాల ఇబ్బందులు, భూసారం, ఎరువుల వాడకం తదితరి అనేక పనులు నిర్వహిస్తున్నారు. డిప్లమో, డిగ్రీలు చేసిన ఎంపిఇఒలకు పేరుగొప్పగా పేరుకు అధికారులమే అయినా కనీసం వేతనాలు లేకుండా పనిచేయడం జరుగుతోంది. దీనికితోడు ఎప్పుడు ఉద్యోగం పోతుందోనని అభద్రతాభావంతోనే ఉద్యోగం చేయడం జరుగుతోంది.

గత ప్రభుత్వాల ఆధీనంలో పనిచేసిన వారిని కొత్త ప్రభుత్వాలు వచ్చిన వెంటనే అర్థాంతరంగా ఉద్యోగాల నుండి తొలగించింది. నేడు కూడా అదే జరుగుతుందనే ఆందోళనతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎంపిఇఒలు ఆందోళన చెందడం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే పోరాటం నిర్వహించడం జరుగుతోంది. ప్రభుత్వం, అధికారులు వెంటనే జోక్యం చేసుకుని తమకు ఉద్యోగభద్రతకై భరోసా ఇవ్వాలని కోరడమైనది. కలెక్టరేట్ వద్ద ఆందోలన అనంతరం కలెక్టర్ కాటమనేని భాస్కర్‌ను కలిసి వినతి పత్రం ఇవ్వమైనది.

అనంతరం జిల్లా మంత్రి గంటాశ్రీనివాసరావు నివాసానికి వెళ్లి మంత్రితో చర్చించడమైనది. ఈనెల 25న అమరావతిలో ఉన్నతాధికారులతో మాట్లాడి ఎంపిఇఒలకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటానని మంత్రి హామీనివ్వమైనది. జిల్లా అధ్యక్షులు అప్పలనాయుడు, శ్రీనివాసరావు, శ్రీరామ్మూర్తి తదితరులు నాయకత్వం వహించారు.

## మాతృభాషకు ఊపిరిపోస్తున్నది సాహితీవేత్తలే

### రాచకొండ పుస్తకావిష్కరణసభలో గీతం అద్యక్షుడు శ్రీభరత్



విశాఖపట్నం: ఆంగ్ల భాషను బోధించే పాఠశాలలతో, ఆంగ్లంలో మాత్రమే వ్యవహారికం జరిపే వాతావరణంలో మాతృభాషను బతికిస్తూ ఊపిరిపోస్తున్నది సాహితీవేత్తలేనని గీతం అద్యక్షుడు ఎమ్,శ్రీభరత్ పేర్కొన్నారు. రాచకొండ విశ్వనాథ శాస్త్రీ సోదరుడు డాక్టర్ రాచకొండ నరసింహ శర్మ తెలుగు కథల ఆంగ్లానువాదం "వేతన శర్మ అండ్ అదర్ స్టొరీస్" పుస్తకాన్ని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శ్రీభరత్ ఆవిష్కరించారు. తెలుగు వారిగా పుట్టి నివసిస్తున్న ప్రాంతంలోనే తెలుగు భాష మాట్లాడలేని దుస్థితిలో ఉన్నామని, ప్రవాస తెలుగు వారిగా మారిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.వివిధ మాండలికాలతో వివిధ ప్రాంతాలలోని తెలుగు రచయితలు రాసిన కథలను మూలకథలోని అర్థం చెడి పోకుండా ఆంగ్లనువాదం చేయడం డాక్టర్ రాచకొండ నరసింహశర్మ సాహితీ ప్రతిభకు తార్కాణ మన్నారు. ప్రసన్న భారితి వంటి సాహితీ సంస్థలను కనుమరుగు కాకుండా బతికించు కోవాల్సిన అవసరం ఉందన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ గాంధీయన్ స్టడీస్‌లో గల భాషా విభాగం ద్వారా త్వరలో తెలుగు భాషా విభాగాన్ని ప్రాంరంభిస్తామన్నారు.

కార్యక్రమంలో ప్రసన్న భారతి అద్యక్షులు ఆచార్య పొన్న పల్లి వెంకటకృష్ణయ్య అద్యక్షత వహించగా ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ డి.వి. సూర్యారావు రచయిత అనువాద ప్రక్రియ లో గొప్పతనాన్ని గూర్చి వివరించారు. డాక్టర్ ప్రయా గ సుబ్రహ్మణ్యం పుస్తకంపై విశ్లేషణ చేశారు. కార్యక్రమంలో ప్రసన్న భారతి కార్యదర్శి కె. సర్వేశ్వర ప్రసాద్, వివిధ సాహితీ సంఘాల వారు పాల్గొన్నారు.

## ఏపీఈపీడీసీఎల్ ఇన్ చార్జ్ సిఎండిగా రాజబాపయ్య



విశాఖపట్నంః ఏపీయస్పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్గా విధులు నిర్వహిస్తున్న కె.రాజబాపయ్యను ఏపీఈపీడీసీఎల్ నూతన డైరెక్టర్ (ప్రొజెక్ట్స్)గా నియమిస్తూ ఇంధన శాఖ శనివారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వులలో కె.రాజబాపయ్యకు ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్గా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ జైన్ ఉత్తర్వులు జారీచేసారు. విద్యుత్ శాఖకు ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం ఆయనకు ఏపీఈపీడీసీఎల్కు డైరెక్టర్గా (ప్రొజెక్ట్స)గా నియమించినది.

కులవృత్తుల వినియోగదారులకు ఉచిత విద్యుత్ ఆంధ్రప్రదేశ్ తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు మరియు పశ్చిమ గోదావరి జిల్లాలలో వివిధ కుల వృత్తుల వారికి ఉచిత విద్యుత్తు అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఒక ప్రకటనలో సంస్థ డైరెక్టర్ ఆపరేషన్స్ శ్రీ బి. శేషుకుమార్ తెలిపారు. దారిద్ర్యరేఖకు దిగువున గల, రజకులతో నడపబడుతున్న లాండ్రీలకు, హెయిర్ కటింగ్ సెలూన్లకు 150 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని, బంగారం వృత్తిదారుల షాపులకు, చేనేత వృత్తిదారులకు, అత్యంత వెనుకబడిన (ఎంబిసి) 38 కులాల వారికి 100 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. వీటికి అర్హులైన వారు తెలుపు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కులధృవీకరణ పత్రాలను తీసుకుని సంబంధిత విద్యుత్ శాఖ సెక్షన్ కార్యాలయములో సంప్రదించాలన్నారు. వివరాలు నమోదు చేయించుకున్నవారికి ఉచిత విద్యుత్ పథకాన్ని వర్తింపచేస్తామన్నారు. అంతేకాకుండా ఇప్పటికే ఎస్సీ, ఎస్టీలకు 125 యూనిట్లలోపు వినియోగిస్తున్న వారికి 100 యూనిట్ల వరకు ఉచితంగాను, గ్రామీణ నర్సరీలకు, దోబీగాట్లకు పూర్తిగా ఉచితంగాను అందిస్తున్నామన్నారు. రైతులకు అందిస్తున్న ఉచిత విద్యుత్తు 7 గంటల నుంచి 9 గంటలకు పెంచటం వలన సంస్థ పరిధిలోని 5 జిల్లాలలో 2,25,643 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు రోజుకు సుమారు 2.5 మిలియన్ యూనిట్లు అదనపు వినియోగం జరుగుతుందన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంజిల్లాలకు ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు, తూర్పు గోదావరి జిల్లాకు రాత్రి 12 గంటల నుండి ఉదయం 9 గంటల వరకు, ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు రెండు గ్రూపులుగా, పశ్చిమ గోదావరి జిల్లా రాత్రి 1 గంట నుండి ఉదయం 10 గంటల వరకు, ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు రెండు గ్రూపులుగాను వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. 2018-19 సంమునకు గాను వ్యవసాయ విద్యుత్ పంపుసెట్ల సర్వీసుల కొరకు 5 జిల్లాలలో ఇప్పటి వరకు 6875 కనెక్షన్లను మంజూరు చేస్తామని ఇంకా 2557 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని వాటిని మార్చి 31 నాటికి పూర్తి చేస్తామన్నారు. సంస్థ అందిస్తున్న సేవల పట్ల 82% మంది వినియోగదారులు సంతృప్తిని వ్యక్తం చేశారన్నారు. యన్టిఆర్ జలసిరి పథకంలో భాగంగా ఇంత వరకు 6585 సర్వీసులు మంజూరు చేశామని ఇంకా 524 దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయని వాటిని మార్చి 31 నాటికి పూర్తి చేస్తామన్నారు. ఇంధనశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్జైన్ ఆదేశాల మేరకు ఈ పథకాలకు సంబంధించిన సమాచారమును వినియోగదారులకు చేరేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా క్షేత్రస్థాయి సిబ్బందికి పూర్తి అవగాహన కల్పించాలని 5 జిల్లాల సూపరింటెండెంట్ ఇంజనీర్లకు అవసరమైన సూచనలను ఇచ్చామని తెలిపారు.

# నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా



విశాఖపట్నం : నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా అని ద్రోణంరాజు శ్రీనివాసరావు అన్నారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, దక్షిణ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే ద్రోణంరాజు శ్రీనివాసరావు శనివారం 27వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాలలో ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం రాష్ట్రానికి వచ్చిన ఏఐసీసీ అధ్యక్షులు, ఈ దేశానికి కాబోయే ప్రధాన మంత్రి రాహుల్ గాంధీ మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పిస్తానని ఉద్ఘాటించారు. అదేవిధంగా దక్షిణ నియోజకవర్గంలో ఉన్న అన్ని వార్డులలో మౌలిక సదుపాయాలు కల్పించి తద్వారా నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తానని అన్నారు. మరోసారి కాంగ్రెస్ పార్టీని గెలిపించి ప్రజా సేవ చేసేందుకు అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. ఇంటింటికీ వెళ్లిన ద్రోణంరాజు వారి సమస్యలను, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వార్డు కాంగ్రెస్ అధ్యక్షుడు రామారావు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికసంఖ్యలో మహిళలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఎంపిఇఒల ఆందోళనకు సిఐటియు మద్దతు

విశాఖ సిటీః శనివారం ఉదయం కలెక్టరేట్ వద్ద జరిగిన వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న ఎంపిఇఒల ఆందోళనకు కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఫెడరేషన్ (సిఐటియు) జిల్లా నాయకులు వి.వి.శ్రీనివాసరావు పాల్గొని మద్దతు తెలియజేయడమైనది. తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తరువాత ఉద్యోగాలకు భద్రత లేదని, ఎప్పుడు ఎవరి ఉద్యోగం పోతుందో తెలియని పరిస్థితి ఉన్నదన్నారు.

## ఓటు ఒక వజ్రాయుధం ప్రతి ఒక్కరూ విధిగా వినియోగించుకోవాలి

### - కలెక్టర్ కార్తికేయ మిశ్రా




కాకినాడ : దేశ భవితను మార్చే శక్తి ఈ ప్రపంచంలో ఒక్క ఓటుకు మాత్రమే ఉందన్నారు జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా. ఓటు వజ్రాయుధం లాంటిదని,18 సంవత్స రాలు నిండిన ప్రతి పౌరుడు విధిగా ఓటు నమోదు చేసుకుని, వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఓటర్లను చైతన్య పరచడానికి భారత ఎన్నికల సంఘం సహకారంతో "రేడియో అల 90.8 ఎఫ్.ఎం", మలిరెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ లు సంయుక్తంగా ప్రారంభించిన "నా ఓటు - నా హక్కు" కార్యక్రమానికి సంబంధించిన ప్రచార సామగ్రిని జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా శనివారం విడుదల చేసారు. కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఓటర్ల నమోదు కేంద్రాలలో ఈనెల 24న ప్రతి ఒక్కరూ తమ ఓటు నిర్దేశిత ఓటర్ల జాబితాలో ఉన్నది లేనిది సరిచూసుకుని, లేని పక్షంలో తక్షణమే నమోదు చేయించుకోవాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితాలో తమ ఓటు ఉన్నది లేనిదీ తెలుసుకోవడానికి టోల్ ఫ్రీ నంబర్ :1950 ఫోన్ చేయడం ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. "ఓటర్ హెల్ప్ లైన్ " యాప్ ద్వారా కూడా ఓటర్ల జాబితాలో పేరు ఉన్నది లేనిది తెలుసుకునే అవకాశం ఉన్నదని చెప్పారు. అలాగే యాప్ ద్వారా ఓటరు నమోదు చేసుకునే అవకాశం రాష్ట్ర ఎన్నికల సంఘం కల్పించిందని దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు సూపరింటెండెంట్ విశాల్ గున్ని, జాయింట్ కలెక్టర్ మల్లిఖార్జున, సమాచార శాఖ ఉప సంచాలకులు ఎం.ఫ్రాన్సిస్, రేడియో అల 90.8 ఎఫ్.ఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి. ఈశ్వర ప్రసాద్, స్టేషన్ డైరెక్టర్ సత్య తదితరులు పాల్గొన్నారు.

## సమర్థవంతంగా పోలీసుశాఖ పనిచేయాలి

విజయనగరం: తొమ్మిది అసెంబ్లీ, మూడు పార్లమెంటరీ నియోజక వర్గాలుకు జరిగే ఎన్నికలు జిల్లాలోని అన్ని ప్రాం తాలు ప్రభావితం అవుతా యన్నారు. గత ఎన్నికల కంటే ఈసారి జరిగే సార్వత్రిక ఎన్నికలకు జిల్లాలో 152 పోలింగు కేంద్రాలు అదనంగా పెరిగా యన్నారు. కార్యాలయంలో జిల్లా ఎస్పీ మాసాంతర నేర సమీక్షా సమావేశాన్ని శనివారంఎస్పీ ఎ.ఆర్. దామోదర్ నిర్వహించారు. ప్రజాస్వామ్య యుతంగా, ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛగా ఎన్నికల నిర్వహణకు సన్నాహకాలు, రెవెన్యూ, పోలీసు అధికారుల సమన్వయం గురించి చేపట్టాల్సిన అంశాలపైనే ప్రధానంగా చర్చించారు. ఈ సమీక్షా సమావేశానికి జిల్లా కలెక్టరు హరి జవహర్‌లాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో కూడా గతంలో కంటే మరిన్ని అదనపు బాధ్యతలును అధికారులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు.

## సృజనాత్మక ప్రదర్శనలు ప్రేక్షకుల్ని కట్టిపడేశాయి

విశాఖపట్నం: సృజనాత్మక ప్రదర్శనలు ప్రేక్షకుల్ని కట్టిపడేశాయి. సాంస్కృతిక వైవిధ్యం పెల్లుబికింది. 'పోలక్స్ హ్యాపిట్యూడ్' పేరిట పోలక్స్ విద్యా సంస్థల 53వ వార్షికోత్సవం శనివారం సాయంత్రం అక్కయ్యపాలెం జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న రాజీవ్ గాంధీ స్టేడియం సమశీతోష్ణ (ఎ.సి.) క్రీడా ప్రాంగణంలో వైభవంగా జరిగింది. నగరం నలుచెరగులా విస్తరించి ఉన్న పోలక్స్ స్కూల్ సుమారు 3600 మంది బాలల ఈ ఉత్సవం నిర్వహించారు.



### యువకుల్లో స్ఫూర్తి నింపేందుకు

# మాతృభాష పరిరక్షణ

- ఇందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
- మా కుటుంబ సభ్యులు రాజకీయాల్లోకి రారు
- ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



నెల్లూరు: మాతృభాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. మాతృ భాష పరిరక్షణకు ఏం చేస్తారో ప్రతి రాజకీయ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించాలన్నారు. అందుకోసం ప్రజలు ఒత్తిడి తేవాలని పేర్కొ న్నారు. నెల్లూరు జిల్లాలో నాలుగో రోజు పర్యటిస్తున్న ఆయన వెంకటాచలంలో శనివారం మీడియాతో మాట్లాడారు. తన కుటుంబ సభ్యుల్లో ఎవరూ రాజకీయాల్లోకి రాబోరని స్పష్టం చేశారు. స్వర్ణభారత్ ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు చేపడతారని వెల్లడించారు.

ఇక నుంచి ఐదు అంశాలతో ప్రజల్లోకి వెళ్తానని ఉప రాష్ట్రపతి పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా పర్యటించి యువకుల్లో స్ఫూర్తి నింపు తానని తెలిపారు.

శాస్త్రవేత్తల పరిశోధనలు పరిశీలిస్తానని చెప్పారు. దేశానికి వెన్నెముకగా ఉన్న రైతుల వద్దకు వెళ్తానని, భారత దేశ సంస్కృ తిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తానని వెల్లడించారు.

## అప్పన్నను దర్శించుకున్న భారత క్రికెట్ టీమ్ సభ్యులు



సింహాచలం :సింహగిరి శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారిని భారత క్రికెట్ టీమ్ ఆటగాళ్లు శిఖర్ ధావన్ ,సంజయ్ బంగర్ మరియు కోచ్ రవిశాస్త్రి ఇతరులు శనివారము స్వామివారిని దర్శించుకున్నారు. సింహగిరికి చేరుకున్న వీరికి సింహాచలం ఆలయ ఈ ఓ కె .రామచంద్రమోహన్ ఆలయ సంప్రదాయం ప్రకారం సాదర స్వాగతం పలికారు . బేడా ప్రదిక్షణ, కప్పస్థంబ ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో అర్చకస్వాములు వీరి గోత్రనామములతో ప్రత్యేక అర్చనలు చేయగా, లక్ష్మీ అమ్మవారి దర్శనం చేసుకున్న వీరికి ఆలయ వైదికులు వేద అశీర్వచనం పలికారు. ఆలయ ఈ ఓ వీరికి స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

## సుజుకి మోటర్ సైకిల్స్ మెగా సర్వీస్ క్యాంప్‌నకు అపూర్వ స్పందన

- నేడూ కొనసాగనున్న క్యాంప్
- సర్వీస్, వెహికల్ చెకప్, వాషింగ్ మరియు పాలిషింగ్ ఉచితం
- విడిభాగాల కొనుగోలుపై 10% రాయితీ
- ప్రతి వినియోగదారునికీ ఆకర్షణీయమైన బహుమతి



విశాఖపట్నం: సుజుకి మోటార్ సైకిల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మరియు పద్మజ సుజుకి వారి ఆధ్వర్యంలో ఆంధ్రా యూనివర్సిటి నార్త్ క్యాంపస్‌లో ఫిబ్రవరి 23, 24 తేదీలలో ఉ. 8 గం. నుండి సా. 6 గం. వరకు మెగా సర్వీస్ క్యాంప్ నిర్వహిస్తున్నారు.

సుజుకి మోటర్స్ సైకిల్ జోనల్ హెడ్ (సేల్స్) ఖచీమా సురేష్ మరియు జోనల్ హెడ్ (సర్వీస్) కె.వి. కృష్ణ కుమార్, రీజనల్ సర్వీస్ మేనేజర్ వినోద్ నట్రోజన్‌ల ఆధ్వర్యంలో ఈ క్యాంప్ నిర్వహించబడుతున్నది. మొదటి రోజే 350కి పైగా వాహనదారులు ఉచిత సర్వీస్ సదుపాయాన్ని వినియోగించుకున్నారు. ఆదివారం కూడా ఈ క్యాంప్‌ని నిర్వహిస్తున్నారు. ఈ క్యాంప్‌లో సర్వీస్, వెహికల్ చెకప్, వాషింగ్ మరియు పాలిషింగ్ ఉచితంగా అందించారు. GixXer కస్టమర్ల కొరకు చైన్ క్లీనింగ్ మరియు లూబ్రికేషన్ కాంప్లిమెంటరీ సదుపాయాలు మరియు క్యాంపులో అమ్మబడిన విడి భాగాలు, ఇంజన్ ఆయిల్ మరియు ఏక్ససరీలపై 10% రాయితీ ఇస్తున్నారు. కొత్తవాహనాలకు 100% వరకు ఋణ సదుపాయం, స్పాట్ లోన్, రూ.9,000 వరకు పేటీఎం ప్రయోజనాలు, స్పాట్ ఎక్స్ఛేంజ్ సౌకర్యం, రూ.1 డౌన్ పేమెంట్ స్కీమ్ మరియు 2 గ్రాముల బంగారు నాణెం గెలుపొందే అవకాశం కల్పించారు. అంతే కాకుండా వాహనముతో వచ్చే ప్రతి వినియోగదారునికీ ఆకర్షణీయమైన బహుమతి ఇస్తున్నారు.

ఈ కార్యక్రమంలో వరుణ్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ వినోద్ కుమార్, జనరల్ మేనేజర్ ప్రసాద్, సుజుకి ఇండియ మరియు పద్మజ సుజుకి సిబ్బంది పాల్గొన్నారు.



### నేటి ఉదయం హెచ్‌పిసిఎల్‌కు రానున్న

## మరో భారీ యంత్రం

ములగాడ: మల్కాపురం ట్రాఫిక్ పోలీసులు తెలిపిన సమాచారం మేరకు హిందూస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌లో నూతన ప్రాజెక్టుకు ఆదివారం హిందుస్థాన్ షిప్‌యార్డ్ నుంచి బయటికి రానున్న భారీ యంత్రాన్ని హెచ్‌పిసిఎల్ తరలిస్తున్న సమయంలో ట్రాఫిక్ కొంత అంతరాయం ఏర్పడుతుందని ట్రాఫిక్‌ను దారి మళ్లించే విధంగా గాజువాక నుంచి హైవే మీద ఈ నగరానికి చేరుకుంటుందని పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. దీనికి వాహనదారులు అందరూ సహకరించాలని పోలీసులు తెలిపారు.

## గుర్రంపాలెం ప్లాట్లకు విద్యుత్ సరఫరా చేయాలి

### విద్యుత్ శాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశాలు



విశాఖపట్నం: మార్చి మాసాంతాని కల్లా గుర్రంపాలెం ఎం.ఎస్.ఎం. ఇ.పార్కు ప్లాట్లకు విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ కె.భాస్కర్ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ అద్యక్షతన కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమల అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. కమిటీ కన్వీనర్ మరియు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఎ.రామలింగేశ్వర రాజు సమావేశ అజండాను అంశాల వారీగా పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా కలెక్టర్ కు వివరించారు. గుర్రంపాలెం, రాచపల్లి ఎం.ఎస్.ఎం.ఇ. పార్కుల్లో చిన్న చిన్న ప్లాట్లను అన్నింటినీ కలుపుతూ పెద్ద పెద్ద ప్లాట్లగా పారిశ్రామిక వేత్తలకు కేటాయించేందుకు చర్యలు తీసు కోవాలని ఎ.పి.ఐ.ఐ.సి. అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సింగిల్ విండో ద్వారా అందే ధరఖాస్తులు వారం రోజుల్లో పరిష్కరించాలని, పరిశ్రమల ప్రోత్సాహ కాలు వారం రోజుల్లోనే మంజూరు చేయాలన్నారు. ఆఫ్ లైన్ ద్వారా అందిన ఒక క్లైమ్‌నకు రూ.11.53 మరియు ఏపీ ఆన్‌లైన్ ద్వారా అందిన 55 క్లైమ్‌లలో 45 క్లైమ్‌లకు రూ 1.45 కోట్లు ఇన్సెంటివ్‌ను మంజూరు చేసేందుకు ఆమోదం తెలిపారు. ఏ.పి.ఐ.ఐ.సి. జోనల్ మేనేజరు యతిరాజులు, కాలుష్య నియంత్రణ మండలి ఇ.ఇ. లక్ష్మీనారాయణ, విద్యుత్ శాఖ ఎస్.ఇ. ప్రసాద్ , ఐలా కమీషనర్, వుడా, జి.వి.ఎం.సి. పోలీస్, అగ్నిమాపక శాఖల అధికారులు, పలు పరిశ్రమల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిర్ణయానికి

# కట్టుబడి ఉంటాం

- భారత్-పాక్ మ్యాచ్‌పై టీమిండియా సారథి కోహ్లీ
- నేడు విశాఖలో ఆస్ట్రేలియాతో టి-20



దిల్లీ: పుల్వామా దాడి నేపథ్యంలో ప్రపంచకప్‌లో పాక్‌తో మ్యాచ్‌పై భారత జట్టు సారథి విరాట్ కోహ్లీ స్పందించాడు. ఈ సందర్భంగా పుల్వామా దాడిని మరో సారి ఖండించాడు. ప్రజల మనోభావాలను కాపాడటం తన బాధ్యతని తెలిపాడు.

పుల్వమా దాడిలో ప్రాణాలు కోల్పోయిన జవాన్ల ఆత్మకు శాంతి చేకూరాలి. మ్యాచ్ రద్దు అంశంపై మేం ఒక నిర్ణయానికొచ్చాం. పుల్వామా ఘటనపై ఎన్నో దేశాలు స్పందించాయి. ఘటనను ఖండించాయి. ఇప్పుడు భారతీయుల మనోభావాలను కాపాడాల్సిన బాధ్యత జట్టు కెప్టెన్‌గా నా మీద ఉంది. కాబట్టి భారత ప్రభుత్వం, బీసీసీఐ ఏ నిర్ణయం తీసుకుంటే దానికి మేం కట్టుబడి ఉంటాం. వారి నిర్ణయాన్ని గౌరవిస్తాం అని తెలిపాడు.

పాక్‌తో మ్యాచ్‌ను భారత్ రద్దు చేసుకోవాలని పలువురు మాజీలు కోరుతున్నారు. పాక్‌తో మ్యాచ్‌ను బహిష్కరించే బదులు ఆడి ఆ జట్టును ఓడించడం మంచిదని గావస్కర్, సచిన్‌లాంటి వారు అభిప్రాయపడుతున్నారు. తాజాగా ఈ అంశంపై భారత మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ స్పందించారు. ఆడటం, ఆడకపోవడం అనే మనలాంటి వాళ్లు నిర్ణయించేది కాదని, దీనిపై కేంద్రమే నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నారు. తొలి టి-20 సందర్భంగా విశాఖ స్టేడియంలో నేడు భారత్ - ఆస్ట్రేలియా జట్లు తలపడనున్నాయి.



రైల్వే ఇండోర్ స్టేడియంలో 71వ పురుషుల మరియు 34వ మహిళల సీనియర్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ విజేతలుగా 55 కేజీల పురుషుల విభాగములో రిషికాంత సింగ్ బంగారు పతకం సాధించారు. 45 కేజీల మహిళల విభాగంలో రియా సేన్, 149 కేజీల విభాగంలో మీరా భాయి బంగారు పతకాలు సాధించారు.








### విషపూరిత మద్యం 84కు చేరిన మృతులు

గువహటి: అసోంలో విషపూరిత మద్యం తాగి ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 84కు చేరుకుంది. ఈ ఘటనలో ఒక్క గోలాఘాట్‌లోనే 39 మరణాలు సంభవించాయి. మరో 200 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వేడుకలో భాగంగా తేయాకు తోటల్లో పనిచేసే కూలీలు ఈ కలుషిత మద్యం సేవించి ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు తెలిపారు.

గోలాఘాట్‌లోని సల్మారా టీ ఎస్టేట్‌లో పనిచేస్తున్న కూలీలు గురువారం రాత్రి వేడుక చేసుకున్నారు. ఇందుకోసం స్థానికంగా ఉండే సంజు ఒరాంగ్ అనే వ్యక్తి నుంచి మద్యం తీసుకొచ్చారు. మద్యం సేవించిన కాసేపటికే నలుగురు మహిళలు కుప్పకూలారు. శుక్రవారం ఉదయం మరో 13 మంది ప్రాణాలు కోల్పోయారు.






VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com